నిరసన తెలుపుతున్న నేతలు

ఎపి మోడల్ స్కూలులో ఉపాధ్యాయుల కొరత

ఆందోళనలో విద్యార్థులు

ప్రజాశక్తి-పత్తికొండ

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నామని గొప్పలు చెబుతుంది. పిల్లలకు మనమిచ్చే ఆస్తి చదువు ఒక్కటే అని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అంటారు. విద్యా, వైద్య, ఆర్థిక రంగాలలో వెనుకబడిన ప్రాంతం పత్తికొండ. అలాంటి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఏ ఒక్క ప్రజాప్రతినిధికి ఆలోచన లేదు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం 2013లో ఎపి మోడల్ స్కూల్‌ను ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఉత్తమ విద్య బోధించడానికి ఉపాధ్యాయుల్లేని పాఠశాల అయింది. ఎపిమోడల్ స్కూల్లో విద్యాబోధన, ఆఫీస్ సిబ్బంది కొరతతో విద్యార్థులు అక్కడున్న ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో 600 మంది విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, కంప్యూటర్ ఫ్యాకల్టీ, లైబ్రరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సైన్సు,మ్యాథమెటిక్స్, జువాలజీ, బాటని ఉపాధ్యాయులు లేకపోవడంతో 2022- 23 సంవత్సరంలోని పదవ తరగతి 98 మంది రాయిగా 75శాతం, ఇంటర్మీడియట్లో 180

మంది రాయగా 50శాతం విద్యార్థులు పాసయ్యారు. మిగిలిన విద్యార్థులు ఫెయిల్ అయ్యి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాల తెరిచి మూడు నెలలు గడిచినా ఇంతవరకు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పాఠశాలలో విద్యాబోధన లేకపోవడంతో విద్యార్థులు టిసి తీసుకొని వెళ్తున్నారని ఉపాధ్యాయులు బహిర్గతంగానే చెప్తున్నారు. విద్యాశాఖ అధికారులు నిద్రావస్థలో ఉన్నారని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించిఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్పందనలు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు..

- మోడల్ స్కూల్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ కౌశల్ రేష్మ

పత్తికొండ ఎపి మోడల్ స్కూలులో ఉపాధ్యాయుల , ఆఫీస్ సిబ్బంది కొరత ఉందని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశాం. ఉన్న సిబ్బందితోనే విద్యాబోధన చేస్తున్నాం.

చదువు అంటే నాకు చాలా ఇష్టం..

- స్వాతి 9వ తరగతి

ఎపి మోడల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాను. చదువు అంటే నాకు చాలా ఇష్టం. పాఠశాలలో మ్యాథమెటిక్స్, సైన్సు ఉపాధ్యాయులు లేకపోవడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నాను. మా పాఠశాలకు ఉపాధ్యాయులు నియమించాలని కోరుతున్నాను.

కార్పస్ ఫండ్ ద్వారా జీతాలు చెల్లించాలి

- కలెక్టరేట ఎదుట ఎపిటిఎఫ్ మోకాళ్లపై కూర్చుని నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పెండింగులో ఉన్న ఉపాధ్యాయుల జీతాలను వెంటనే కార్పస్ ఫండ్ ద్వారా చెల్లించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయ రాజు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద గాంధీ విగ్రహం ముందు ఆదివారం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షులు ఎస్.ఇస్మాయిల్ అధ్యక్షత వహించిన ధర్నాలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో దాదాపు 2 వేలకు పైగా ఉపాధ్యాయులకు 3 నెలలుగా జీతాలు లేక పాలు, కిరాణం, నిత్యావసర వస్తువుల కొనుగోలు , బ్యాంకులో రుణాలు కంతులు ఆగిపోవడం ఇలా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జూన్‌లో బదిలీల ప్రక్రియ పూర్తి అయితే 3 నెలల గడిచినా జీతాలు చెల్లించకపోతే ఏ విధంగా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. ఈ విషయంపై అనేక మార్లు ప్రభుత్వ దృష్టికి తెచ్చినా తేదీలు ప్రకటిస్తుంది గానీ జీతాలు మంజూరు చేయడం లేదన్నారు. టెక్నికల్ సమస్యలు అధికమించి టీచర్లు, ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒ, పిజిటిలకు తక్షణమే మూడు నెలల జీతాలు చెల్లించాలన్నారు. లేనిచో ప్రభుత్వ కార్పస్ ఫండ్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించాల్సిన సిఎఫ్ఎంఎస్ విధానం ద్వారా సమస్యల పరిష్కారం రోజుల తరబడి కూడా కానందున సిఎఫ్ఎంఎస్ వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీతాలను వెంటనే చెల్లించని పక్షంలో తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ. కమలా కరరావు, ప్రధాన కార్యదర్శి ఐ మరియానందం , స్టేట్ కౌన్సిలర్లు మద్దిలేటి, గఫార్, హాకీమ్, తిమ్మప్ప, శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, జిల్లా సబ్ కమిటీ సభ్యులు స్వామినాథన్, శేషయ్య, శ్రీరాములు, శేషాచలం, వెంకటరాముడు, ఆయా మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలి

ఎపి రైతుసంఘం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లాలో కరువు ఛాయలు నెలకొంటున్నాయని వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ రైతులతో కలిసి, ఉల్లి ,కంది పత్తి పంట పొలాలను పరిశీలించారు. గ్రామంలో సుమారు పదివేల ఎకరాలకు పైగా సాగు భూమి ఉండగా అందులో 80 శాతం భూమిలో పత్తి,కంది, ఉల్లి,మిరప సోయాబీన్ తదితర పంటలు సాగు చేశారని పేర్కొన్నారు. విత్తనం, నాటువేసినప్పటి నుండి వర్షాలు లేకపోవడం కారణంగా పెరగాల్సిన పంటలు గిడస భారీ ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రైతులు పెట్టుబడులు పెట్టి లక్షలాది రూపాయలు నష్టపోయారన్నారు. ముఖ్యంగా కౌలు రైతులు మరింత నష్టపోయారన్నారు. రాముడు అనే కౌలు రైతు పది ఎకరాలు సొంత భూమిలో పంటలు వేసి మరో 30 ఎకరాలు కౌలుకు తీసుకొని లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టపోయి తీవ్రమైన ఆవేదనతో ఉన్నట్లు రైతు సంఘం బృందం దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి .రామకృష్ణ మాట్లాడుతూ ఇంతటి తీవ్రమైన పరిస్థితులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నాయన్నారు. తీవ్ర మనోవేదనకు గురవుతున్న రైతులను ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఈ క్రాప్ బుకింగ్ కూడా నేటి వరకు పూర్తిస్థాయిలో చేయలేదన్నారు. అనేక కారణాలు చెప్పి కాలయాపన చేస్తుందన్నారు. దీనివలన ప్రభుత్వం నుండి వచ్చే సహాయం కూడా అందకుండా పోయే పరిస్థితి ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తక్షణమే అన్ని పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేసి కరువు జిల్లాగా ప్రకటించి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని, 2022- 23 సంవత్సరంలో తీసుకున్న పంట రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని చెబుతున్నప్పటికీ రైతులకు ఏమాత్రం అనుకూలమైన విధానాలు చేపట్టడం లేదని విమర్శించారు. రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సింది వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, గ్రామ రైతులు వెంకటయ్య, శివన్న, ఇస్మాయిల్ రాముడు, బడేసాహెబ్, రంగస్వామి, నాగన్న, హుశే నాలం, తిమ్మప్ప, ఇంబ్రహీం, తిరుపాల్‌రెడ్డితో పాటు 20 మంది రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నాటక రంగాన్ని పునరుద్ధరించాలి

- విశ్రాంత కలెక్టర్ బలరామయ్య

ప్రజాశక్తి- కర్నూలు కల్చరల్

రాయలసీమలో సాంఘిక నాటక రంగాన్ని పునరుద్ధరింప చేయాల్సిన అవసరం ఉందని యువ కళాకారులు నాటక రంగంలోనికి ప్రవేశించాలని విశ్రాంత జిల్లా కలెక్టర్ జి. బలరామయ్య సూచించారు. ఆదివారం రాత్రి కళావిపంచి, టిజివి కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో మూడు రోజుల నాటకోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సభలో కలపత్రిక సంపాదకులు ప్రముఖ పత్రిక రచయిత మహమ్మద్‌రఫీ, జిఎల్ఎన్‌మూర్తి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జి.బలరామయ్య మాట్లాడుతూ అనంతపురం కడప వంటి జిల్లాల్లో నాటక రంగం అదృశ్యం అవుతుందని దీన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. టిజివి కళాక్షేత్రంలో ప్రతినెల చివరి ఆదివారం సాంఘిక నాటక రంగం ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టివి.నటులు మల్లాది భాస్కర్, థింక్ దర్శకులు మంజునాథంలను ఘనంగా సన్మానించారు. ఈ సభలో ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు కథక్ అంజిబాబు, వ్యాఖ్యాత డి.రామకోటేశ్వరరావు కళావిభజన అధ్యక్షులు బొప్పన నరసింహారావు, నటులు ఆదినారాయణ, కళావిపంచి కార్యదర్శి జివి. శంకర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మల్లాది భాస్కర్ దర్శకత్వంలో తులసీ తీర్థం నాటికను మంజునాథ్ దర్శకత్వంలో థింక్ నాటికను ప్రదర్శించారు. టీజీవి కళాక్షేత్రం అధ్యక్ష కార్యదర్శులు పత్తి ఓబులయ్య,మహమ్మద్ మియా, లక్ష్మీ కాంతారావు, సంగా ఆంజనేయులు, ఇనయతుల్లా, యాగంటి ఈశ్వరప్ప, లక్ష్మణ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న దృశ్యం

ఉపాధి కల్పనే ధ్యేయం

- ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ - ప్రజాశక్తితో జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నిరుద్యోగులకు ఉపాధి కల్పన ధ్యేయంగా పనిచేస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి పేర్కొన్నారు. తమ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగులు అందరికీ జాబ్ మేళాలో నిర్వహించే పలు సంస్థల్లో ఉద్యోగ నియామకాలను పొందేలా చూస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని త్వరలో ఐటీ ల్యాబ్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు...

జిల్లాలో నిరుద్యోగ యువతకు ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు?

అధికారి : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నాము. ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, సిడాప్ సంయుక్తంగా జాబ్ మేళాలో నిర్వహించి పలు ప్రైవేటు సంస్థల ఉద్యోగ నియామకాలను కల్పించడం జరుగుతుంది. ఇక నుండి తమ దగ్గర రిజిస్ట్రేషన్ చేసుకున్నటువంటి నిరుద్యోగుల వివరాలను నేషనల్ సర్వీసెస్ పోర్టల్ నందు నమోదు చేయడం జరుగుతుంది. ఇక ప్రైవేటు సంస్థలు కూడా నేరుగా జాబ్ మేళాలో పాల్గొని నిరుద్యోగ అభ్యర్థులను ఎంపిక చేసుకునేలా చర్యలు తీసుకోనున్నాము.

జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని జాబ్ మేళాలు నిర్వహించారు?

అధికారి : ఉమ్మడి జిల్లాలో ప్రతి నెలలో ఒక మెగా జాబ్ మేళా, నాలుగు జాబ్ మేళాలు నిర్వహించాము. అనేకమందికి ఉద్యోగ నియామకాలను పలు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందుతున్నారు. ఇప్పటికే ఏప్రిల్ మాసం నుండి జూన్ వరకు పలు నియోజకవర్గ కేంద్రాల్లో జాబ్ మేళా కార్యక్రమాలను నిర్వహించి వారికి ఉద్యోగ నియామకాలను చేపట్టాము.

జిల్లాలో స్థానికంగా ఉన్నటువంటి సంస్థల్లో నిరుద్యోగులకు ఎందుకు అవకాశాలు కల్పించలేకపోతున్నారు?

అధికారి : స్థానికంగా ఉన్నటువంటి పారిశ్రామికవేత్తలను గుర్తించి వారి సంస్థల్లో అవసరమైనటువంటి ఉద్యోగ నియామకాలను చేపట్టేలా ప్రతి నెల సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో కూడా ఉద్యోగాలు పొందేలా దృష్టి పెట్టాం.

ఇంటర్, డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ లాంటివి ఏమైనా విద్యార్థులకు ఇస్తున్నారా?

అధికారి : ఇప్పుడు జిల్లాలోని టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులందరికీ కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులు తమ చదువులను పూర్తి చేసుకున్న తర్వాత తమ కెరియర్ ఉజ్వలంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఇప్పటికే అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగింది.

సెర్ప్ సిఇఒ ఇంతియాజ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఉద్యోగులు

ఉద్యోగులకు అండగా ఉంటా

సెర్ప్ సిఇఒ ఇంతియాజ్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

డిఆర్‌డిఎ ఐకెపిలో పనిచేసిన ఉద్యోగులకు అండగా ఉంటానని సెర్ఫ్ సిఇఒ ఎండి ఇంతియాజ్ పేర్కొన్నారు. ఆదివారం కర్నూలుకు వచ్చిన ఆయనను కర్నూలు, నంద్యాల జిల్లాల ఐకెపి, డిఆర్‌డిఎ ఉద్యోగులు అసోసియేషన్ నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. ఇంతియాజ్ మాట్లా డుతూ ఐకెపి డిఆర్‌డిఎలో పనిచేసే ఉద్యోగుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ద్యోగుల రెగ్యులరేషన్ ప్రక్రియపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి అన్ని విధాలుగా కట్టుబడి ఉంటానని ఆయన పేర్కొన్నారు. నంద్యాల ఐకెపి, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి కర్నూల్ ఎపిడి శ్రీధర్‌రావు , డిపిఎంలు అబ్దుల్ రహిమాన్ నర్సమ్మ ఎపిఎంలు, ప్రసాద్ పుల్లయ్య , కరుణాకర్ రాఘవేంద్ర , శ్రీనివాసులు, కృష్ణుడు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా ఇసి కమిటీకి చిన్నకొండయ్య

ప్రజాశక్తి -సి బెళగల్

వైసిపి జిల్లా కార్యనిర్వాహక సభ్యులుగా తుంగభద్ర మాజీ ఎల్లెల్సి చైర్మన్ పోలకల్ చిన్న కొండయ్య ఎన్నికయ్యారు. ఇందులో భాగంగా ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ గర్వంగా ఉందని పేర్కొన్నారు. మండలంలోనే కాకుండా జిల్లాలో వైసిపి బలోపేతానికి, ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

డాక్టర్ హరికిషన్‌కు గిడుగు సాహిత్య పురస్కారం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్ :

కర్నూలుకు చెందిన కథకులు, బాలసాహిత్యంలో విశేషంగా కృషిచేస్తున్న డాక్టర్ ఎం.హరికిషన్‌కు తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి పురస్కారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. గిడుగు జయంతి సందర్భంగా ఈనెల 29న ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న 'తెలుగు భాషా వికాస వారోత్సవాలలో ఈ పురస్కారాన్ని అందించనున్నారు. ఈ నెల29న విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో భాషావారోత్సవాల్లో పురస్కార సత్కారం అందుకోనున్నారు.

టంగుటూరి దక్షిణభారత కేసరి : ఐవైఆర్ కృష్ణారావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్రకేసరే కాదు దక్షిణ భారత కేసరి అని ప్రభుత్వ మాజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఐవైఆర్ కష్ణారావు అన్నారు. ఆదివారం కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో టంగుటూరి ప్రకాశం జయంతోత్సవ సభ కురాడి చంద్రశేఖర్‌కల్కూర అధ్యక్షతన నిర్వహించారు. సభలో ఐవైఆర్ కృష్ణారావు ముఖ్యోపన్యాసం చేశారు. ఆయన నాయకులకే నాయకుడని కొనియాడారు. ఆయన త్యాగనిరతి ఎంతో గొప్పదని అన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ విసి ఆచార్య డివిఆర్ సాయి గోపాల్, టంగుటూరి ప్రకాశం పంతులు మనుమళ్లు టంగుటూరి శ్రీరామ్ ,టంగుటూరి గోపాలకృష్ణ హాజరయ్యారు. టంగుటూరి వారి సేవలు అసాధారణమైనవని ఆయన ఎవరికీ తలవంచని నిజాయితీగల విద్యావేత్త, రాజకీయ వేత్త అని టంగుటూరి మనవడు శ్రీరాం అన్నారు. ఆయన పేరు మీద ఒక విశ్వవిద్యాలయం ఉన్నదని తెలిపారు. టంగుటూరి ప్రకాశం విగ్రహాలను రెండు రాష్ట్రాల్లోనూ స్థాపించుకోవాల్సిన ఆవశ్యకతను గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా విజయ సర్గ శర్మ,గంగాధర్ రెడ్డి , చంద్రశేఖర్ , ఎలమర్తి రమణయ్య , రాజశేఖర్, రాధాకృష్ణ డాక్టర్ ప్రకాశం జీవితం ఆదర్శ దాయకం అంటూ వివరించారు. విద్యార్థులు ప్రకాశం జీవితం సమాజసేవ అనే అంశం మీద చక్కటి ఉపన్యాసాలను ఇచ్చి సభను ప్రారంభించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సభలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ డి.పార్వతి దేవి సమన్వయం చేశారు. ఇదే సందర్భంగా కావెం సుబ్బలక్ష్మి ప్రత్యేకంగా సన్మానించారు. చంద్రమోహన్, సీతాలక్ష్మి, పసుపులేటి నీలిమ, గోనెగండ్లకళ్యాణి, జయలక్ష్మి, విజయలక్ష్మి, రాధారాణి, జె.సుశీల ఈ సత్కార కార్యక్రమంలో పాల్గొన్నారు. సాహితీ సదస్సు ప్రకాశం సంస్థ అభివృద్ధి సంస్థ హైదరాబాద్ వారు సదస్సులో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి ఇంత చక్కటి కార్యక్రమం కళాశాలలో నిర్వహించినందుకు అభినందించారు

ఐవిఆర్ కృష్ణారావును సన్మానిస్తున్న అతిథులు, కెవిఆర్ కళాశాల సిబ్బంది

పేదరికం పోవాలనే సంక్షేమ పథకాలు

కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సంక్షేమ పథకాలు వివరిస్తున్న హాఫీజ్‌ఖాన్

పేదరికం పోవాలనే సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని , అది ముఖ్యమంత్రి జగనన్నతోనే సాధ్యమని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ. హాఫీస్ ఖాన్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరం, 52వ వార్డ్ 131వ సచివా లయం పరిధిలో కోర్ట్ లైన్ వీధుల్లో పర్యటించారు. పేదల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే ఫహీజ్ ఖాన్ అన్నారు. కర్నూలు 52వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బంది, స్థానిక వార్డు నాయకులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికాభివద్ధితోనే పేదల బతుకులు మారుతాయని చెప్పారు. ఈ ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి ప్రతి ఇంటికి మేలు చేసేలా పథకాలు తీసుకొచ్చి పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. 52వ వార్డ్ వైసిపి నాయకులు వార్డ్ ఇంచార్జి సర్దార్ మహేష్, రమణ, ఈబ్రు, మునిస్వామి, పార్టీ ముఖ్యనాయకులు, వార్డ్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక ధరలు, విద్యుత్ చార్జీల పెరుగుదలపై సమరభేరి

సిపిఎం మండల కార్యదర్శి బి నాగన్న

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అధిక ధరలు పై విద్యుత్ చార్జీల పెంపు పై నిర్వహించనున్న సమరభేరి పోరాటాన్ని విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న కోరారు. ఈ మేరకు ఆదివారం ప్రజాసంఘాల కార్యాలయంలో మండల నాయకులు చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 30 నుండి వచ్చే నెల 4 వ తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ, సచివాలయాల ముందు నిరసనలు, మండల కార్యాలయాల ముందు ధర్నాల నిర్వహించాలని కోరారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను మానుకుని, ప్రజా అనుకూలమైన విధానాలను అవలంబించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ప్రకతి వ్యవసాయ పద్ధతులు దాని వెనుక ఉన్న శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించుకొని వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకుని ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ జూమ్ మీటింగ్ ద్వారా రైతు శాస్త్రవేత్తలకు, మెంటర్‌లకు తెలిపారు. ప్రకతి వ్యవసాయ జ్ఞానంతో ముడిపడిన అంశంగా పరిగణించాలని, పచ్చని పంటలతో 365 రోజులు పంటలు, మోడల్స్ వుండేలా వేయడం వల్ల వివిధ రకాల ఫలితాలు వున్నాయన్నారు. వ్యవసాయం చేసే రైతును రైతు శాస్త్రవేత్తగా చేయాలనే లక్ష్యంతో నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం కర్నూలు ఉద్యాన భవన్ రైతు శిక్షణ కేంద్రంలో ఆదివారం రీజినల్ స్థాయి శిక్షణ కార్యక్రమంను ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ అధ్యక్షతన ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్రస్థాయి దిమాటిక్ లీడ్స్ సుధాకర్, సురేష్ , కన్సల్టెంట్ లక్ష్మయ్య హాజరయ్యారు. సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ జూమ్ ద్వార ప్రకతి వ్యవసాయ 9 సార్వత్రిక సూత్రాలు - ఆవశ్యకత గురించి తెలిపారు. ఏడాది పొడుగునా నేలను పంటలతో కప్పి ఉంచడం వల్ల భూమిని పలు రకాల మిశ్రమ పంటలతో కప్పి ఉంచడం వలన భూమికి నేరుగా సూర్యరశ్మి తగలకుండా కాపాడవచ్చున్నారు. దీని వలన నేలలో సూక్ష్మ వాతావరణం ఏర్పడి నేలలోని సూక్ష్మజీవులు వృద్ధి చెందడంతో పాటు నేలలోని తేమ పెరిగి వాతావరణంలోనికి ఆవిరి కాకుండా ఒక కవచంలా ఉపయోగపడుతుందని అన్నారు. వ్యవసాయ క్షేత్రంలో చెట్లను కూడా అనుసంధానం చేసే ప్రక్రియ చాలా ముఖ్యమైనదన్నారు. ఎందుకంటే చెట్ల యొక్క వేళ్ళు , వేరు వ్యవస్థ భూమి లోపల చాలా ఎక్కువ లోతుకు విస్తరిస్తాయని,ఈ చెట్లు స్రవించే వేరు స్రవాల ద్వారా ఎక్కడో భూమి లోపల పొరల్లో ఉన్న సూక్ష్మజీవులు కూడా ఉత్తేజమై మొక్కలకు అవసరమైన పోషకాలను అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో థిమాటిక్ పాయింట్ పర్సన్స్ నీరజ, చిరంజీవి, డిస్ట్రిక్ పాయింట్ పర్సన్స్ శ్వేతా, సలీం, సందీప్, మల్లికార్జునలు ప్రకతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం విద్యార్థిపై విషంగక్కిన టీచరును సస్పెండ్ చేయాలి

అవాజ్ నగర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఉత్తరప్రదేశ్లో ముస్లిం విద్యార్థిపై విషం చిమ్మిన టీచర్‌ను వెంటనే సస్పెండ్ చేయాల ఆవాజ్ కమిటీ ఆదివారం ఒక పత్రిక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో అమానుషం జరిగిందని ముస్లిం విద్యార్థిపై విద్యాబుద్ధులు నేర్పించాల్సిన టీచర్ మైనార్టీల రక్షణ గౌరవం గాలిలో దీపంలా మారుతున్నాయని, యోగి సర్కార్ తీరులో ఎటువంటి మార్పు లేదన్నారు. వరసగా మైనారిటీల పైన దాడులు జరుగుతూనే ఉన్నాయని ఇది తాజా సంఘటనని ఆవాస్ కమిటీ నగర అధ్యక్ష కార్యదర్శులు పి. ఇక్బాల్ హుస్సేన్, మహమ్మద్ షరీఫ్ లు తీవ్రంగా ధ్వజమెత్తారు. ఉత్తర ప్రదేశ్ లో విద్వేషపూరిత సంస్కృతి తీవ్రమవుతున్నదని మైనారిటీలు ముఖ్యంగా ముస్లింలపై దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఇలాంటి ఘటనలు విద్యాసంస్థలకు చేరాయన్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే ఆ వర్గం విద్యార్థులను తోటి విద్యార్థులతో కొట్టిస్తున్నారన్నారు. ముస్లిం బాలుడిని చెప్పుతో కొట్టాలంటూ ఒక టీచర్ విద్యార్థుల ప్రోత్సహించడం ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ ఘటనపై ప్రజాతంత్ర వాదులు లౌకికవాదులు, ప్రతిపక్ష పార్టీలు వెంటనే స్పందించాలని కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తెచ్చి ఉత్తరప్రదేశ్లోని ముజఫర్ నగర్ లో జరిగిన సంఘటన టీచర్‌ను బాధ్యుడిని చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే ఆ టీచర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

సీతారామరెడ్డి కు సన్మానిస్తున్న నాయకులు

సీతారామిరెడ్డికి పలువురు అభినందనలు

ప్రజాశక్తి - మంత్రాలయం

తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా ఎన్నికైన వై. సీతారామిరెడ్డికి అభినందనలు కొనసాగుతున్నాయి. ఆదివారం స్థానిక బ్రహ్మణ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు ఇబ్రహింపురం రామ చంద్రాచార్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో ఆయనకు శేష వస్త్రంతో మహారాజా టోపి ధరింపచేసి పూలమాల వేసి పళ్లు బుట్ట అందజేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు . తహసీల్దార్ దేవా చంద్రశేఖర్ బొక్కెతో, మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు రోగప్ప రవి రెడ్డి ఆధ్వర్యంలో సూగూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు సర్పంచ్ భర్త లక్ష్మయ్యల ఆధ్వర్యంలో గజ మాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గత మూడు రోజులు గా నియోజకవర్గంలోని మండలాల నుండి కాక ఇతర ప్రాంతాల నుంచి వైసిపి నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు అభినందనలతో ముంచెత్తుతున్నారు. బ్రాహ్మణ సంఘం నుంచి కామధేను మోహన్ స్వామి, కోశాధికారి కరణం రవికుమార్ అనంత గుంజల్లి శ్రీనివాసాచార్ గోపి, గురు, జగన్నాథ్ తదితరులు ఉన్నారు.

సీతారామరెడ్డి కు సన్మానిస్తున్న నేతలు

కౌతాళం : టిటిడి నూతన కమిటీ సభ్యులుగా ఎన్నికైన వై సీతారామరెడ్డిని కౌతాళం మండల వైసిపి నాయకులు రమణ గౌడ్ ఆధ్వర్యంలో శాలువా కప్పి గజమాలతో సన్మానించారు. రామన్న గౌడ్ మాట్లాడుతూ ప్రజాసేవకే అంకితమైన రాంపురం రెడ్డి సోదరులైన ఎమ్మెల్యే వై బాల నాగి రెడ్డి , సీతారాం రెడ్డి, ధరణి రెడ్డి, ప్రదీప్ రెడ్డి భవిష్యత్తులో ఎన్నో ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఎంపీటీసీ లింగన్నగౌడ,మాజీ ఎంపీటీసీ ఈశప్పగౌడ, మరళీ సోమశేఖర్, గుడికంబాలి బసప్పగౌడ, కన్వీనర్ కురువ ఆదెప్ప,బోయ ఆంజనేయ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ కట్టపై అసభ్యంగా రాసిన వారిని శిక్షించాలి

- ఎస్‌సి మండల అధ్యక్షులు నాగరాజు డిమాండ్

ప్రజాశక్తి - చిప్పగిరి

ఎస్సై రమేష్ బాబు కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ మండల నాయకులు నాగరాజు, దళిత నాయకులు

భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ కట్టకు నీచమైన రాత రాసిన వ్యక్తిని గుర్తించి, కఠిన చర్యలు చేపట్టాలని ఎస్సీ మండల అధ్యక్షులు నాగరాజు, గ్రామ దళిత నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని నేమకల్లు గ్రామంలో రాత్రి సమయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ కట్టకు నీచమైన రాత రాసిన వ్యక్తిని గుర్తించి అరెస్టు చేయాలని ఎస్సీ మండల అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో ఈరప్ప, తిప్పన్న, నెట్టికల్లు, ఈరన్న, ఎంసీ, శివ, సుంకయ్య, వెంకట రమణ, రాజు, రమేష్ ఎస్ఐ రమేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ ప్రశాంతంగా జీవనం సాగించే గ్రామంలో కొందరి అల్లరి మూకలు గ్రామానికి చెడ్డ పేరు తేవడం బాధగా ఉందన్నారు. చర్యలు తీసుకోలేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు కరెంటు గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని: చిప్పగిరి మండలం నేమకల్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహంపై అనుచిత వాక్యాలు రాసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు కర్నూలు జిల్లా అధ్యక్షులు జి మహానంది డిమాండ్ చేశారు. ఆదోనిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహంపై అనుచిత వ్యాఖ్యలు రాయడం శోచనీయమని అన్నారు. దేశంలో రోజురోజుకు దళితులు పైన మహిళల పైన అత్యాచారాలు మానభంగాలు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టడంలో ప్రభుత్వ యంత్రాంగం ఘోరంగా విఫలమైతుందని అన్నారు. అంబేద్కర్ విగ్రహాలు ఉన్నచోటల సీసీ కెమెరాలు అమర్చివిగ్రహాలకు ర క్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ భరత్, నరసింహులు, సురేష్, రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆ పోలీస్ స్టేషన్‌లో గప్‌చుప్

- సామాన్యులు స్టేషన్‌కొస్తే చుక్కలే..
- పలుకుబడి ఉంటేనే న్యాయం..
- కొరవడిన ఫ్రెండ్లీ పోలీసింగ్
- పిఎస్‌లోనే సివిల్ పంచాయితీలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సమాజంలో తప్పు చేసేవారికి పోలీసులంటేనే అంతో ఇంతో భయం ఉంది. పోలీస్ యూనిఫాం చూసినా.. సైరన్ మోగ్రినా.. ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్ అన్నట్లు గప్ చుప్ అవుతారు. అయితే ఆదోని తాలూకా సర్కిల్ ఇన్స్పెక్టర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇస్వి పోలీస్ స్టేషన్‌లో అందుకు విరుద్ధం. ఈ పిఎస్ (పోలీస్ స్టేషన్)లో అవినీతిలో తారస్థాయికి చేరిందని, ప్రతి కేసుకు ఓ రేటు నడుస్తోందని తీవ్ర చర్చ జరుగుతోంది. పోలీస్ స్టేషన్‌లో ఏమి జరిగినా బయటకు రాదు. గత నెల కాలం క్రితం బదిలీలో భాగంగా నూతన ఎస్సై బాధ్యతలు చేపట్టారు. ఆ ఎస్ఐ అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ వారి పనులు చక్కబడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాలలో కర్ణాటక టేట్రా ప్యాకెట్,అక్రమ ఇసుక,మట్కా,పేకాట జరుగుతున్న ఇప్పటివరకు కేసులు లేవని విమర్శలు వెళ్లి ఉన్నాయి.

పిఎస్‌లోనే సివిల్ పంచాయితీలు

పోలీస్ స్టేషన్ పరిధిలో అధికార పార్టీ నాయకులు చెందిన సివిల్ పంచాయతీలు మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతుందని వివిధ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

కొరవడిన ఫ్రెండ్లీ పోలీసింగ్

ఫిర్యాదుదారులతో మర్యాదన ప్రవర్తించాలని, జవాబుదారిగా ఉండాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌గా ఉండాలని ఉన్నత అధికారులు చెబుతున్నా ఈ పోలీస్ స్టేషన్‌లో కొరవడింది. సామాన్యుల పోలీసు స్టేషన్‌లకు వెళ్లాలంటే ఇప్పటికీ భయంతో వణికిపోతున్నారు. కాస్త పలుకుబడి ఉంటేనే పోలీసు అధికారి వద్దకు తీసుకెళ్తున్నారు. జవాబుదారీతనం కోసం ప్రతి పోలీసు స్టేషన్‌లో రిసెప్షన్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు.కానీ అక్కడ పోలీసు స్టేషన్‌కు వచ్చిన వారికి కనీసం కూర్చోవడానికి కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత ఎస్సైలపై చర్యలు తీసుకోకపోతే స్థానికంగా పోలీసుల ప్రతిష్ట మరింత మసకబారే అవకాశం ఉందని పలువురు కోరుతున్నారు.

గతంలో ఏం జరిగిందో తెలియదు

- ఎస్ఐ శ్రీనివాసులు, ఇస్వి పోలీస్ స్టేషన్.

గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు. తాను బాధ్యతలు చేపట్టిన నెల లోపల సారాయి, లిక్కర్‌కు సంబంధించి 22 కేసులు నమోదు చేశాను. గ్రామాలలో మట్కా,పేకాట నిర్వహిస్తున్న వారిపై సమాచారం అందిస్తే వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతాం. 91211 01143 సమాచారాన్ని ఈ నెంబర్‌కు తెలపాలి.

నైపుణ్యతను వెలికి తీసేందుకే క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మాణిక్ ఎస్ పవార్ అన్నారు. ఆదివారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో డివిజన్ పరిధిలోని 53 పాఠశాలల నుండి దాదాపు 2500 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా రోటరీ క్లబ్ డిస్టిక్ గవర్నర్ మాణిక్ యస్ పవార్, రీజినల్ కోఆర్డినేటర్ విజయ్ నాగరాజు, అసిస్టెంట్ గవర్నర్ భరత్ షా, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఉమేష్ పాయి, కార్యదర్శి నితీష్ గాంధీ, యూత్ ఆఫీసర్స్ అమిత్ గాంధీ, కొల్లి నితిన్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కరస్పాండెంట్ దైవదినం రెడ్డి, మల్లికార్జున విద్యాలయ కరస్పాం డెంట్ సూగురప్పలు కాగడ చేత పట్టుకుని, జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. తదానంతరం క్రీడాకారులతో ముఖ్య అతిథులు రోటరీ క్లబ్ సభ్యులు పరిచయం చేసుకొని పోటీలను జెండా ఊపి ప్రారంభి ంచారు. ఈ క్రీడా పోటీల్లో బాలుర జట్లు ఫుట్బాల్‌లో 16 జట్లు, త్రో బాల్ 20 జట్లు, కబడ్డీ 33 జట్లు, డాడ్జ్ బాల్ 12 జట్లు, బాస్కెట్ బాల్ 5, అథ్లెటిక్స్ 41, బాలికల జట్లలో కోకో గర్ల్స్ 22 జట్లు, త్రో బాల్ 20 జట్లు, కబడ్డీ గర్ల్స్ 20 జట్లు, టెన్నికాయిట్ గర్ల్స్ 14జట్లు, అథ్లెటిక్స్ 40 జట్లు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. క్రీడల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు కప్పులతో పాటు రోటరీ క్లబ్ సర్టిఫికెట్లను, కప్పులను అందించనున్నారు. ఈ క్రీడల పోటీలు సజావుగా సాగేందుకు 60 మంది వ్యాయామ ఉపాధ్యాయుల సహకారం ఎనలేనిదని వారిని ఘనంగా సత్కరించుకున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన పిఈటిలకు విద్యార్థిని విద్యార్థులకు రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. రోటరీ క్లబ్ వారి

ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడ పోటీలను రోటరీ సభ్యుడు సాబీర్ అహ్మద్ సహాయ సహకారాలు ఎనలేని వని సభ్యులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు జీవన్ సింగ్, సునీల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, బసవరాజు, ప్రశాంత్ గాంధీ, రఘునాథ్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, వికాస్ బండారి, రాయచోటి సుబ్బయ్య, వినోద్ జైన్, డాక్టర్ సైపుల్లా, విట్టా రాజేష్, విజయ్ చౌదరి, ఇతేష్, వీరేష్ స్వామి, షణ్ముఖ, శివరాం, హుస్సేన్ బాష తదితరులు పాల్గొన్నారు.

కోట్ల కుటుంబంపై విమర్శలు తగదు : టిడిపి

ప్రజాశక్తి-ఆలూరు

జిల్లా వైసిపి పార్టీ అధ్యక్ష పదవి వ్యామోహంతో బివై రామయ్య కోట్ల కుటుంబంపై విమర్శలు చేయడం తగదని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి సి. నారాయణ రెడ్డి, జిల్లా వాల్మీకి సాధికార కమిటీ సభ్యులు భాస్కర్ అన్నారు. ఆదివారం ఆలూరులో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిస్వార్ధ రాజకీయంగా మకుటంలేని మహారాజు మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి రాజకీయ వారసులు, మాజీ కేంద్రమంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని విమర్శించటం బి వై. రామయ్యకు తగదని అన్నారు. జగన్ మెప్పు కోసం స్తోమత మరచి మాట్లాడితే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. తొందరలోనే సైకో వైసిపిని ప్రజలు ఇంటికి సాగనంపే సమయం అసన్నమైనదని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు నారాయణ, చంద్రశేఖర్,మసాలా జగన్, నాగరాజు, హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సి.నారాయణ రెడ్డి

జర్నలిస్టును సన్మానించిన దృశ్యం

సీనియర్ జర్నలిస్ట్‌కు సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

జర్నలిజంలో సుదీర్ఘ కాలం పాటు సేవలను అందిస్తూ అందరి మన్ననలతో పాటు ఆజాత శత్రువుగా అనిపించుకొన్న సీనియర్ జర్నలిస్ట్ విజేంద్ర నాథ్ ప్రసాద్‌కు 'ఖాజీ ఇండియా ఫౌండేషన్' వారు గుర్తించి 'లైఫ్ టైమ్ అచీవ్ మెంట్' అవార్డును బహుకరించి నందుకు వీరశైవ, జంగమ పోరాట హక్కుల సమితి, బిసి సంఘం నాయకులు ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యం డి భద్రీనాథ్, కన్నె జగదీష్,మజీ కౌన్సిలర్ మల్లికార్జున మాట్లాడుతూ వృత్తి రీత్యా సివిల్ ఇంజనీర్ ఐన ప్రసాద్ గత 38 సంవత్సరాలుగా జర్నలిజంలో విశిష్ట సేవలను అందిస్తూనే,ప్రసాద్ ప్లానర్స్ పేరుతో ఇంజనీర్‌గా ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో మద్దికెర రామకృష్ణ, యెరూరు శివన్న గౌడ్, యం డి హుస్సేన్, మల్లేష్ పాల్గొన్నారు.

పని వేళల్లో ఎంఇఒ కార్యాలయానికి రావొద్దు : ఎంఇఒ

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల పనివేళల్లో ఎవ్వరు కూడా మండల విద్యాధికారి కార్యాలయానికి రాకూడదని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పని వేళల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఏదైనా అవసరం ఉంటే పాఠశాల సమయం అయిపోయిన తర్వాత కార్యాలయానికి రావాలని తెలిపారు. ఎవ్వరైనా పాఠశాల సమయంలో వచ్చిన ఎడల అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రోడ్డును దాటిస్తున్న కానిస్టేబుల్

ఆదోని పట్టణంలో ఎమ్మిగనూరు రోడ్డు పోలీస్ కంట్రోల్ రూమ్ దగ్గర ఆదివారం ఓ వృద్ధుడు ట్రాఫిక్ దాటడానికి ఇబ్బందిపడటాన్ని గమని ంచిన ట్రాఫిక్ కానిస్టేబుల్ పాలాక్షి రోడ్డు దాటించి మానవత్వాన్ని చాటుకు న్నారు. అతని పరిస్థితిని తెలుసుకొని ఆటోలో కూర్చోబెట్టి పంపించారు. గతంలో ఇస్వి పోలీస్ స్టేషన్లో పనిచేసినప్పుడు మానవత హృదయంతో ఎంతోమందికి స్వయంగా సహాయం అందజేశారు. దీంతో అక్కడున్న పట్టణ కానిస్టేబుల్ ఆదర్శంగా నిలిచారని కొనియాడి అభినందించారు.

రోదిస్తున్న రైతులు

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

రైతు పొలం దున్నుతున్న సమయంలో విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఆదివారం స్థానిక తుంగభద్ర నది తీరంలో పుష్కర ఘాట్ – 3 సమీపంలోని పొలంలో వెంకటేష్ దుక్కి దున్నుతున్న సమయంలో అక్కడ విద్యుత్ కొరకు ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్‌కు అర్తింగ్ వైర్ తగిలి విద్యుత్ షాక్ వల్ల కురువ వెంకటేష్‌కు చెందిన ఎద్దు మృతి చెందినట్లు రైతు వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయాలని కోరారు.

మాట్లాడుతున్న మాధవ రావు దేశాయ్

టిడిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి - నందవరం

ఇబ్రహీం పురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు నరసింహు లును టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, తాలూకా క్లస్టర్ ఇన్ ఛార్జ్ మాధవ రావు దేశాయ్ ఆదివారం పరామర్శించారు. నరసింహులుకు గత నెలలో ఎద్దు దాడి చేయడంతో కాలు విరగడం జరిగింది. దింతో చికిత్స చేయించుకొని ఇంటికి రావడంతో పరామర్శించాడానికి వెళ్ళారు. ఆయన త్వరలోనే కోలుకొని పార్టీ కోసం కృషి చేయాలని కోరారు. ఆయన వెంటా టిడిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, శంకరమ్మ, గణేష్ ఉన్నారు.

విద్యార్థులకు చేయూత

ప్రజాశక్తి - ఆదోని

చైతన్య కళాభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదోని , కోడుమూరు, ఎమ్మిగనూరు, కోసిగి, ఆలూరు, మంత్రాలయం, గూడూరు మండలాలలో ఉన్న నిరాదరణకు గురైన హెచ్ఐవి పాజిటివ్ విద్యార్థినీ విద్యార్థులు 14 మందికి విద్యా సామాగ్రితోపాటు పోషక విలువలు కలిగిన ఆహార ధాన్యం అందించి చేయూత అందించారు. ఆదివారం లిటిల్ డ్రాప్స్ చారిటీ ట్రస్ట్ యుకే వారి ఆర్థిక సహకారంతో ఆదోనిలోని ఫెయిత్ హోమ్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు వాస గిరి విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రోత్సహకాలను సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ బోర్డు సభ్యురాలు గుజరాతి వరలక్ష్మి, ఫెయిత్ హోమ్ డైరెక్టర్ గారు అయినా డేనియల్ ప్రేమ్ కుమార్, ఆదోని మండల కోఆర్డినేటర్ రాజు, నేస్తం డిపార్ట్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎస్సీ ఎస్టీ బీసీ హక్కుల పోరాట సంఘం

ప్రజాశక్తి - నందవరం

సమయ పాలన పాటించని గురజాల పంచాయతీకి చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్ గోవిందుపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ బీసీ హక్కుల పోరాట సంఘం అధ్యక్షులు పరిగేల కృపయ్య, సభ్యులు యం. ఆనంద్, రామ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్ గ్రామ సచివాలయంకు సమయానికి రావడం లేదని, ప్రతిరోజు 12 గంటలకు వస్తున్నారని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అడిగితే నా ఇష్టం నీవు ఎవరు అడగడానికి అని చెప్పడం దారుణం అన్నారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ గోవిందును తక్షణమే సస్పెండ్ చేసి, ప్రజలకు పనిచేసే అధికారుల్ని నియమించాలని వారు కోరారు.

ఎండుతున్న పైర్లు

- హంద్రీనీవా నీటికి పోటీ - మోటార్లతో అక్రమంగా తరలిస్తున్న వైనం
- పట్టించకోని ఇరిగేషన్ అధికారులు

ఎండిపోతున్న సజ్జ

హంద్రీనీవా కాలువ నీరు

హంద్రీనీవాలో అక్రమంగా మోటర్లు వేసిన దృశ్యం

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండలంలో ఎండ వేడిమికి పంటలన్నీ ఎండుతున్నాయి. మండలంలోని 16 గ్రామాలలో దాదాపు 10 గ్రామాలు ఖరీఫ్‌లో మాత్రమే పంటలు సాగు అవుతాయి. ఆరు గ్రామాల్లో మాత్రమే హంద్రీనీవా కాలువ ద్వారా సాగునీరు ఉపయోగించుకొని పంటలు పండించే రైతులు ఉన్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. మండలంలో ఖరీఫ్‌లో ఇప్పటివరకు వేసుకున్న పంటలకు వర్షాలు లేకపోవడంతో రోజురోజుకు ఎండ వేడిమి ఎక్కువ అవుతుండడంతో ఉన్న పైర్లు కూడా ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్‌లో వేసుకున్న కంది, సజ్జ, వేరుశెనగ, పత్తి పైర్లన్నీ ఎండిపోతున్నాయని, పెట్టిన పెట్టుబడులు వదులుకున్నట్లుగానే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హంద్రీనీవాకు సాగునీరు వస్తాయని ఆశతో కాలువకు ఇరువైపులా ఉన్న రైతులందరూ ఆయకట్టదారులు, నానయకట్టుదారులు పోటీపడి మిరప విత్తనం వేసుకున్నారు. విత్తనం వేసుకొని దాదాపు రెండు నెలలు కావస్తు న్నా వర్షాలు లేక ఎండిపోయే పరిస్థితి ఉన్న నేపథ్యంలో హంద్రీనీవాకు సాగునీరు రావడంతో రైతులు కొంతమేర సంతృప్తి చెందారు. అయితే హంద్రీనీవా కాలువలో అక్రమ మోటర్లు వేసుకుని రాత్రి పగలు సాగు నీటిని మళ్ళించుకుంటున్న అధికారులు పట్టించుకోవడం లేదని చిప్పగిరి, బంటన హాల్, ఏరూరు, డేగల హాల్, కాజీ పురం నగర డోనా గ్రామాలకు చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. ఆయకట్టు రైతులకు మాత్రం న్యాయం చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో వేసుకున్న పంటలను గుర్తించి ఆ రైతులకు న్యాయం చేసేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు. అలాగే హంద్రీనీవా కాలువ కింద ఉన్న ఆయకట్టుదారులకు సక్రమంగా నీరు అందేలా చూడాలని, అక్రమ మోటర్లు తొలగించి సాగునీరుని ముందుకు పోయేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వాడుబట్టిన మిరప పంట

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

- అంజి, రైతు సంఘం నాయకులు

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వేసుకున్న పంటలన్నీ వర్షాలు లేక ఎండిపోయే పరిస్థితి నెలకొంది. పెట్టిన పెట్టుబడులలో చిల్లి గవ్వ కూడా చేతికందే పరిస్థితి లేదు. పంటలు వేసుకుని నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం అందేలా అధికారులు కృషి చేయాలి. హంద్రీనీవాకు సాగునీరు వచ్చిన నేపథ్య ంలో కాలువకు ఇరువైపులా ఉన్న అక్రమ మోటర్లు తొలగించి ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలి.

జిల్లా విద్యాభివృద్ధిలో ఆయనది కీలక పాత్ర

- అంకితభావంతో విధుల నిర్వర్థించడంలో ప్రత్యేక స్థానం
- సర్వ శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ వేణుగోపాల్ పుట్టినరోజు సందర్భంగా పలువురు కితాబు

ప్రజాశక్తి - చిప్పగిరి

జిల్లాలో విద్యకు పెద్దపీట వేసినా విధేయుడు విద్యాశాఖ ప్రదాతుడు సర్వ శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి, చిప్పగిరి మండల స్పెషల్ అధికారి డాక్టర్ వేణుగోపాల్ అని మండలంలో పలువురు పేర్కొంటు న్నారు. జిల్లాలో ఎన్నో సంవత్సరాలుగా విద్యాశాఖలో ఉపాధ్యాయునిగాను, లెక్చరర్ గాను, ప్రిన్సిపల్ గాను విధులు నిర్వహించి అంచలంచెలుగా విద్య అభివృద్ధి పథంలో నడిపించి ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యక్తి సర్వ శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ వేణుగోపాల్. 'డాక్టర్ వేణుగోపాల్ విధి నిర్వహణలో అంకిత భావంతో విధులు నిర్వహించి అందుబాటు లో ఉంటూ విద్యాశాఖకు జిల్లాలోనే ప్రత్యేక స్థానం కల్పించుటలో అహర్నిశలు కృషి చేశారు. ప్రస్తుతం అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహిస్తూ చిప్పగిరి మండలం స్పెషల్ అధికారిగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుకు కృషి చేస్తున్నారు. ఎప్పటికప్పుడు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై దృష్టి సాధిస్తూ సంబంధిత అధికారులను హెచ్చరిస్తూ సంక్షేమ పథకాలు ప్రభుత్వ భవన నిర్మాణాలు ఆగకుండా కృషి చేస్తూ అధికారులను పాలనపరంగా వేగవం తం చేయుటలో అభివృద్ధి ప్రధాతుడని చిప్పగిరి మండలంలో వివిధ శాఖల అధికారులు పేర్కొంటు న్నారు'. 1995లో ఉద్యోగంలో చేరిన ఈయన అప్పటినుండి ఇప్పటివరకు జిల్లా అధికారుల మన్ననలు పొందుతూ అంచలంచలాగా విద్యాశాఖ అభివృద్ధికి నేటి వరకు కృషి చేస్తూ శభాష్ వేణు గోపాల్ అనే విధంగా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుత కలెక్టర్ సృజన ఆదేశాల మేరకు మండలంలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు, మండలంలో సచివాలయ నిర్మాణాలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలు, ఆర్ బి కే కార్యాలయాల నిర్మాణాలు జరిగేందుకు సంబంధిత కాంట్రాక్టర్లతో, అధికారులతో మాట్లాడి చిప్పగిరి మండల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. డాక్టర్ వేణుగోపాల్ పుట్టినరోజు సందర్భంగా ఆయన సేవలను పలువురు ప్రసంసిస్తున్నారు.

మంత్రి బుగ్గన చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న డాక్టర్ కే వేణుగోపాల్ (ఫైల్)

నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - మంత్రాలయం

మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ గ్రామ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ జిల్లా కమిటీ అధ్యక్షులు రామతీర్థం అమ్రేష్ మాదిగ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో గ్రామ కమిటీని జిల్లా మహిళా అధ్యక్షురాలు కదిరికోట బతు కమ్మ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. గ్రామ అధ్యక్షులుగా బాలస్వామి, ఉపాధ్యక్షులుగా ఏసన్న, సభ్యులుగా దేవదాసు, పీటర్, ఇజ్రాయిల్, రాయప్ప, బొడ్డన్న, హనుమంతు, స్వామినాథం, రాజన్న, అంథోని, డీలర్ దేవదాసు, శాంతిరాజు, జయరాజు, ఆంధ్రసు, దేవదానం, రాజు, బాలరాజు, రవి, శాంతిరాజు, దేవయ్య, సామేలు, రాయప్ప ,అయ్యప్ప, తోమస్ ,బెలగంటి దేవదానం, జాజిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సుంకేశ్వరి గ్రామ సర్పంచ్ బి.ముక్కరన్న, అడ్వకేట్ కిషోర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో కమిటీలు వేస్తూ సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. బిజెపి ప్రభుత్వం తక్షణమే ఎస్సీ రిజర్వేషన్లకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పులు డప్పుకొట్టు కళాకారుల పింఛను 5000 రూపాయలకు పెంచాలని, చర్మకారులకు, మాదిగ నిరుద్యోగులకు ప్రతి జిల్లాలో చెప్పుల కాంప్లెక్స్ నిర్మాణం ఏర్పాటు చేసి ఉచితంగా కేటాయించాల న్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేసి 27 సంక్షేమ పథకాలను కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బేడ బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షులు మోతే రామరాజు, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సుమాల చార్లెస్ మాదిగ, గ్రామస్తులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONBLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE ADONI
O.S No. 271/2022

Between:
J. Mahalingaiah Swamy. ...plaintiff
AND
V. Balaraju. ...defendants

NOTICE

To:
Vadde Balaraju S/o Late V Hanumanthappa, aged about 45 Years, Residing of Nadhichagi Village, Kowthalam Mandalam, Kurnool Dist, Andhra Pradesh - 518 333.

Whereas the above named plaintiff has filed above suit against you. This Hon'ble Court was pleased permit the plaintiff to serve summons to defendant by way of paper publication. Therefore you are hereby directed to appear before this Hon'ble Court on 12/09/2023 at 10:30 AM either in person or through your Advocate and file your objections, failing which the matter will be decided in your absence.

LK Jeevan Singh,
B.E.,LL.B
Advocate for Plaintiff

ఇద్దరు సచివాలయ ఉద్యోగులు సస్పెన్షన్

- మున్సిపల్ కమిషనర్‌తో పాటు మరో ముగ్గురికి షోకాజ్ నోటీసులు
- జారీ చేసిన జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని వార్డు సచివాలయాల్లో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ గైర్హాజరైన ఇద్దరు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదేశాలు జారీ చేశారు. ఏపి సేవా పోర్టల్‌కు సంబంధించిన 21 సేవలు ఎస్ఎల్ఏ దాటి పెండింగ్‌లో ఉన్న కారణంగా సంజాయిషీ కోరుతూ నంద్యాల మున్సిపల్ కమిషనర్ సి.రవి చంద్రారెడ్డికి, మరో ముగ్గురికి షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో జిల్లా కలెక్టర్ గ్రామ, వార్డు సచివాలయాల తనిఖీ సమయంలో సచివాలయాల్లోని సిబ్బంది విధులకు ఆలస్యంగా హాజరు కావడంతో పాటు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న నేపథ్యంలో సచివాలయ సిబ్బంది స్పందన కార్యక్రమాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ మొక్కుబడి రీతిలో వ్యవహరించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భాగంగా ఈ నెల 21 నుండి 26 వరకు వారం రోజులపాటు ప్రతిరోజు నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమంలో హాజరు శాతాన్ని జిల్లా కలెక్టర్ పరిగణలోకి తీసుకున్నారు. స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన బాధ్యత వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలదే అయినప్పటికీ గైర్హాజరై విధులలో అలసత్వం వహించిన లలిత నగర్ సచివాలయ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ టి.బాబావలి, సలీం నగర్ సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ఎం.సుధాకర్ రెడ్డిలను సస్పెండ్ చేశారు. అలాగే జగజ్జనని నగర్ సచివాలయ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ఎస్.అజమతుల్లా, నూనెపల్లి హరిజన వాడ సచివాలయ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ఎన్.నారాయణ, వైఎస్సార్ నగర్ సచివాలయ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ కె. జస్వంత్ బాబులకు సంజాయిషీ నిమిత్తం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సచివాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ నివేదికల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయం సిబ్బంది తరచూ గైర్హాజరవుతున్నారని, సమయానికి రావడం లేదని గత ఆరు నెలల కాలంలో సంబంధిత సచివాలయాల్లో ఒకసారి కూడా తనిఖీ చేయకపోవడం, స్పందన ఫిర్యాదులను ఎస్ఎల్ఏ సమయంలో పరిష్కరించక పోవడం, ఏపి సేవా పోర్టల్‌లో 21 సేవలు ఎస్ఎల్ఏ దాటి పెండింగ్‌లో ఉండడంతో సంజాయిషీ కోరుతూ నంద్యాల మున్సిపల్ కమిషనర్ సి. రవి చంద్రారెడ్డికి జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

ఎండుతున్న బోర్లు, బావులు

- నీరందక ఎండిపోతున్న పంటలు - వర్షం కోసం రైతన్నల ఎదురుచూపులు

బోరు ఎండిపోవడంతో నీరందక బీటలు వారిన వరి పొలంలో దిగాలుగా కూర్చున్న రైతు

నీరు లేక ఎండిపోతున్న మొక్కజొన్న పంట

ప్రజాశక్తి - బనగానపల్లె

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్న పరిస్థితి దీనంగా మారింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా వర్షాలు లేకపోవడంతో బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు ఇంకిపోయి రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. వర్షం కోసం రైతన్న మేఘాల వైపు దీనంగా చూస్తున్నాడు. వేల రూపాయలు అప్పులు చేసి పంటలను సాగు చేస్తే వర్షాలు లేక బోర్లలో భూగర్భ జలాలు ఎండిపోయి పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయి. చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని మదన పడుతున్నాడు.

బనగానపల్లె మండలంలో ఆయా గ్రామాల్లో బోర్లు, బావుల కింద సాగు రైతులు వరి 2 వేల ఎకరాలు, మొక్కజొన్న 3 వేల ఎకరాలు, మిరప 2500 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ప్రస్తుతం భూగర్భ జలాలు ఇంకిపోయి నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయి. పంటలు ఎండిపోతుండడంతో దిక్కుతోచని రైతులు పశువులను మేతగా మేపుతున్నారు. వేల రూపాయలు అప్పులు చేసి పంటలను సాగు చేస్తే మొక్కజొన్న పంట చేతికి వచ్చిన సమయంలో నీళ్లు లేక ఎండిపోతుండడంతో రైతుల ఆవేదన వర్ణనాతీతం. మొక్కజొన్న ఎకరానికి రూ. 40 వేలు అప్పు చేసి సాగు చేస్తే నెల రోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో నీళ్లు లేక ఎండిపోతుందని రైతులు వాపోతున్నారు. వరి ఎకరానికి రూ.30 వేలు ఖర్చు చేసి సాగు చేస్తే నీళ్లు లేక భూమి బీటలు వారి ఎండిపోతుందని, అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు మదన పడుతున్నారు. వరుణుడి కోసం కర్షకులు నింగివైపు చూస్తూ ఆశగా నిరీక్షిస్తున్నారు. మొదట్లో ఒక మోస్తారు వర్షాలు కురవడం వల్ల భూమిలో వేసిన విత్తనం మొలకెత్తి, ప్రస్తుతం మధ్యస్థ దశలో చేరుకుంది. వర్షాకాలం సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా మళ్లీ చినుకు జాడ లేకపోవడంతో పంటలు కళ్ళ ముందే ఎండి పోతుంటే చూడలేక తల్లడిల్లిపోతున్నారు. కొందరు రైతులు పంటలు నష్టపోలేక, ఆశ చంపుకోలేక నీటి ట్యాంకులు సమకూర్చుకొని వాటి ద్వారా పైపులైన్లు ఏర్పాటు చేసుకొని పంటలకు నీటి తడిని పెట్టుకుంటున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. అప్పులు చేసి ఎకరాకు రూ. 20 వేల చొప్పున ముందస్తు కౌలు డబ్బులు చెల్లించి, మరో రూ. 30 వేలు పెట్టుబడులు పెట్టి భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాగు చేసిన పంటలు ఎలాగూ చేతికి దక్కే పరిస్థితి కనిపించడం లేదని, కనీసం పశువుల కడుపు అయినా నిండుతుందని, కష్టపడి సాగు చేసిన పంట పొలాలను కొందరు రైతులు పశువులకు మేతగా వదిలేశారు. ఖరీఫ్ సీజన్ లో సాగు చేసి నష్టపోయిన పంటలను ప్రభుత్వం తక్షణమే సర్వే జరిపించి, పంట నష్టం జరిగిన రైతులకు ఎకరాకు రూ. 50 వేలు పంట నష్టపహారం ప్రకటించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఎకరానికి 40 వేలు పెట్టుబడి పెట్టి 5 ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశాను. బోర్లలో నీళ్లుఇంకిపోయి పంట ఎండి పోతుంది. నెలన్నరలో పంట చేతికి వచ్చేది. బోర్లలో నీళ్లు లేక పంట ఎండిపోతుంది. ప్రభుత్వం ఎకరానికి రూ. 50 వేలు పంట నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి.

- రైతు భాస్కర్ రెడ్డి, యనకండ్ల గ్రామం.

వేసిన పంటలు ఎండిపోతున్నాయి

మూడు ఎకరాల్లో వరి, రెండు ఎకరాల్లో మిరప, నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాను. బోర్లలో నీళ్ళు లేక పంటలన్నీ ఎండిపోతున్నాయి. ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

- రైతు శ్రీనివాసరెడ్డి, యాగంటిపల్లె గ్రామం.

ఉపాధి కల్పనే ధ్యేయం

- ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు కెరియర్ గైడెన్స్
- ప్రజాశక్తితో జిల్లా ఉపాధి కల్పన అధికారిణి దీప్తి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నిరుద్యోగులకు ఉపాధి కల్పన ధ్యేయంగా పనిచేస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి దీప్తి పేర్కొన్నారు. తమ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగులు అందరికీ జాబ్ మేళాలో నిర్వహించే పలు సంస్థల్లో ఉద్యోగ నియామకాలను పొందేలా చూస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని త్వరలో ఐటీ ల్యాబ్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు...

జిల్లాలో నిరుద్యోగ యువతకు ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు?

జిల్లా ఉపాధి కల్పన అధికారిణి : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నాము. ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, సిడాప్ సంయుక్తంగా జాబ్ మేళాలో నిర్వహించి పలు ప్రైవేటు సంస్థల ఉద్యోగ నియామకాలను కల్పించడం జరుగుతుంది. ఇక నుండి తమ దగ్గర రిజిస్ట్రేషన్ చేసుకున్నటువంటి నిరుద్యోగుల వివరాలను నేషనల్ సర్వీసెస్ పోర్టల్ నందు నమోదు చేయడం జరుగుతుంది. ఇక ప్రైవేటు సంస్థలు కూడా నేరుగా జాబ్ మేళాలో పాల్గొని నిరుద్యోగ అభ్యర్థులను ఎంపిక చేసుకునేలా చర్యలు తీసుకోనున్నాము.

జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని జాబ్ మేళాలు నిర్వహించారు?

జిల్లా ఉపాధి కల్పన అధికారిణి : ఉమ్మడి జిల్లాలో ప్రతి నెలలో ఒక మెగా జాబ్ మేళా, నాలుగు జాబ్ మేళాలు నిర్వహించాము. అనేకమందికి ఉద్యోగ నియామకాలను పలు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందుతున్నారు. ఇప్పటికే ఏప్రిల్ మాసం నుండి జూన్ వరకు పలు నియోజకవర్గ కేంద్రాల్లో జాబ్ మేళా కార్యక్రమాలను నిర్వహించి వారికి ఉద్యోగ నియామకాలను చేపట్టాము.

జిల్లాలో స్థానికంగా ఉన్నటువంటి సంస్థల్లో నిరుద్యోగులకు ఎందుకు అవకాశాలు కల్పించలేకపోతున్నారు?

జిల్లా ఉపాధి కల్పన అధికారిణి : స్థానికంగా ఉన్నటువంటి పారిశ్రామికవేత్తలను గుర్తించి వారి సంస్థల్లో అవసరమైనటువంటి ఉద్యోగ నియామకాలను చేపట్టేలా ప్రతినెల సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో కూడా ఉద్యోగాలు పొందేలా దృష్టి పెట్టాం.

ఇంటర్, డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ లాంటివి ఏమైనా విద్యార్థులకు ఇస్తున్నారా?

జిల్లా ఉపాధి కల్పన అధికారిణి : ఇప్పుడు జిల్లాలోని టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులందరికీ కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులు తమ చదువులను పూర్తి చేసుకున్న తర్వాత తమ కెరియర్ ఉజ్వలంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఇప్పటికే అవగాహన

నంద్యాలను కరువు జిల్లాగా ప్రకటించాలి

- గడపగడప కాదు.. పొలం పొలం కార్యక్రమాలు చేపట్టాలి
- రైతులకు పంట నష్టపరిహారం, బీమా అందజేయాలి
- రబీకి విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలి
- ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్

ఎండిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - పాములపాడు

నంద్యాలను కరువు జిల్లాగా ప్రకటించి ప్రభుత్వం నష్టపరిహార చర్యలను తక్షణమే చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం పాములపాడు మండలం రుద్రవరం గ్రామంలో ఎండిపోయిన మొక్కజొన్న పంటలను రైతు సంఘం జిల్లా ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం తొలకరిలో వారం పది రోజులు వర్షాలు అధికంగా కురిసినప్పటికీ అ తర్వాత నుండి నేటి వరకు వర్షం కురవకపోవడంతో రైతులు వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. మొక్కజొన్నకు దాదాపు రూ. 30 వేలు, పత్తి పంటకు రూ. 50 వేలు దాకా రైతులు పెట్టుబడి పెట్టారని చెప్పారు. కౌలు రైతులు కౌలుతో సహా దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. రైతులు ఇంతలా నష్టపోతుంటే ప్రజాప్రతినిధులు గడపగడప కార్యక్రమంలో నిమగ్నమయ్యా రని, ప్రభుత్వం తక్షణమే గడపగడప కాదు పొలం పొలం తిరిగి రైతులను పలకరించి వారి కష్టాలను తెలుసుకోవాలన్నారు. శ్రీశైలంలో 854 అడుగులు స్టోరేజ్‌లోనే నీటిని తీసుకోవచ్చని, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతకం ఎత్తిపోతల పథకం ద్వారా 828 అడుగుల స్టోరేజీ నుండి నీటిని తీసుకోవచ్చన్నారు. పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం, అధికారులు చోద్యం చూస్తున్నారని, తక్షణమే కెసి కెనాల్ కింద అరకొర ఉన్న పంటలకు నీటి విడుదల పెంచాలన్నారు. ఎండిపోయిన పంటలను అధికారులు నష్టపరిహారం అంచనాను (నివేదిక) సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతి పంటకు బీమాను అందించాలన్నారు. రబీ సాగుకు రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.రామేశ్వరరావు, జిల్లా నాయకులు వీరన్న, టి.వెంకటేశ్వరరావు, హనుమంతు, రైతులు సురేష్, రామ్మోహన్ రావు, బషీర్ అహ్మద్, నాగేశ్వరరావు, అహమ్మద్, కరీం, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

లగోరీ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

క్రీడల్లో రాణించాలి : బిసి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

విద్యార్థులు క్రీడల్లో రాణించాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నంద్యాలలోని పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి లగోరి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను బిసి రాజారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు ఓ భాగం కావాలన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, శారీరక ధృఢత్వం లభిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం చాలా మంది విద్యార్థుల్లో ప్రతిభ ఉన్నా వారికి సరైన ప్రోత్సాహం లేక వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు లగోరి పోటీల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. లగోరి అసోషియేషన్ రాష్ట్ర చైర్మన్ సిద్ధార్థ రాజ్, ఉమ్మడి కర్నూల్ జిల్లా సెక్రటరీ పి.శివను ప్రత్యేకంగా అభినందించారు. లగోరి అసోషియేషన్ ఆధ్వర్యంలో బిసి రాజారెడ్డికి శాలువా కప్పి, మెమొంటో అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నంద్యాల 15వ వార్డు కౌన్సిలర్ సాయిరాంకుమార్ రెడ్డి, లగోరి అసోషియేషన్ రాష్ట్ర సెక్రటరీ అనురాధ, పీఈటీ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్లు శివకుమార్ , సాల్మన్‌లు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు పట్టణంలోని 14వ వార్డు హాజీ నగర్‌లో పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కలను వార్డ్ కౌన్సిలర్ మానపాడు అశోక్ ఆదివారం జెసిబి ద్వారా తొలగించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నాయకత్వంలో, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి నేతృత్వంలో ప్రజాసేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి బంగారు హారం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిల లక్ష్మీ నరసింహ స్వామికి ఆదివారం దొర్నిపాడు మండలానికి చెందిన గోపవరం బాలవెంకట రెడ్డి 27.970 గ్రాముల బంగారు హారాన్ని, 167.300 గ్రాముల ఒక వెండి పళ్లాన్ని విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థానం మనియార్ సౌమ్యానారాయణన్ భక్తునికి, కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాటం

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్

ప్రజాశక్తి - ఆత్మకూర్

కోటీశ్వరులకు ఊడిగం చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజానీకంతోపాటు వ్యాపార వర్గాలను సైతం సమస్యలతో ముంచెత్తుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటమే ఆయుధంగా ప్రజలు ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో సిపిఎం డివిజన్ కార్యకర్తల సమావేశం పాములపాడు మండల కార్యదర్శి సామన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తుందని, ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా మతం పేరుతో చీల్చే ప్రయత్నం చేస్తుందని విమర్శిం చారు. మోడీ అధికారంలోకి వచ్చిన ఎనిమిది సంవత్సరాల కాలంలో దేశంలో మహిళలపై హత్యలు, హత్యాచారాలు, నిరుద్యోగం, మత ఘర్షణలు విపరీతంగా పెరిగాయని, ప్రజలపై పన్నుల భారాలు అధికంగా వేసిం దన్నారు. ఏమైనా తగ్గాయా అంటే పంటలకు గిట్టుబాటు ధరలు మాత్రం తగ్గాయని, రైతులు దివాలా తీసే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని అన్నారు. కేంద్రం ఏం పని చేసినా సమర్థిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విపరీతంగా పన్నుల భారం మోపుతుందని అన్నారు. రాష్ట్రంలో నవ రత్నాలు తప్ప మరో రత్నం వైసిపి ప్రభుత్వానికి కనబడటం లేదని విమర్శించారు. అభివృద్ధి శూన్యంగా ఉందన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతి రేకంగా ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు, ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్, నాయకులు వెంకటేశ్వరరావు, రామేశ్వర రావు, స్వాములు, రజాక్, మాభాష, రామ్ నాయక్, ఎస్ఆర్ రమణ, రఫీ, సురేంద్ర, ఇస్మాయిల్, మారెన్న, మల్లికార్జున, సుధాకర్, బాలయ్య, దాసు, పుల్లమ్మ, అక్కమ్మ, సువర్ణమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను బాగు చేస్తే ఆరోపణలేంటి..?

- చౌకబారు ఆరోపణలు మానుకోవాలి
- నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని టిడిపికి
డోన్ మున్సిపల్ చైర్మన్ సూచన

ప్రజాశక్తి-డోన్

అధ్వానంగా ఉన్న మార్కెన్‌ను బాగు చేస్తే టిడిపి నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం సరైంది కాదని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. చౌకబారు ఆరోపణలు చేసి సమయం వృధా చేసుకోవద్దని, నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇవ్వాలని టిడిపి నాయకులకు రాజేష్ హితవు పలికారు. ఆదివారం ఆయన డోన్‌లో విలేకరుల సమావేవంలో మాట్లాడారు. లోన్ తీసుకుని ప్రజాధనాన్ని తాకట్టు పెడుతున్నారని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారని, గతంలో చంద్రబాబునాయుడు 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా ఉండి అప్పుచేయకుండానే పనులు చేశారా అని ప్రశ్నించారు. అమరావతికి అప్పుచేయకుండా నిర్మించారా అని అన్నారు. మార్కెట్ నిర్మాణానికి రూ.16 కోట్లు ఖర్చు అయిందని, రూ.10 కోట్లు ఆర్థికమంత్రి నిధులు మంజూరు చేయించారన్నారు. రూ. ఆరుకోట్లు అప్పుతీసుకుని నిర్మించాం. అక్కడ వచ్చే అద్దెలతో తీసుకున్న అప్పును తిరిగి చెల్లిస్తాం. మున్సిపాలిటీకి ఒక పెద్ద అసెట్ మిగిలిపోయే పని చేశామని చెప్పారు. షాపుల కేటాయింపుల్లో కూడా పారదర్శకంగా ప్రాయారిటీ ప్రకారం కేటాయించామని చెప్పారు. తెలంగాణలో మంత్రి హరీష్‌రావు మార్కెట్‌ను అభివృద్ధి చేసిన తరహాలోనే నిర్మిస్తామని హామీ ఇచ్చామని, దాని ప్రకారం చేశామనేది గుర్తించాలన్నారు. మార్కెట్ అధ్వానంగా ఉండేది దానిని చక్కగా నిర్మించి అన్ని సౌకర్యాలను మెరుగుపరిచాం. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలలో అనవసర కథనాలు రాశారని, ఆరెండు పత్రికలపై మున్సిపాలిటీ తరుపున పరువు నష్టందావా వేస్తున్నామని చెప్పారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీరాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి. జాకిర్ హుస్సేన్, కౌన్సిలర్లు టిఇ.దినేష్‌గౌడ్, మల్లికార్జునరెడ్డి, ఆర్ట్.రమణ, వైసిపి నాయకులు ఆర్ఇ.రాజవర్ధన్, మేకల నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్ సప్తశైల రాజేష్

డాక్టర్ రవికృష్ణకు అంధుల ఆత్మీయ సత్కారం

డాక్టర్ రవికృష్ణకు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్న అంధులు

ప్రజాశక్తి - నంద్యాల

మదర్ థెరిసా దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం నంద్యాల విజువల్ చాలెంజ్డ్ ఉద్యోగులు, నిరుద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక నంద్యాల వికలాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణకు ఆత్మీయ సత్కారం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఓబులేసు, నిరుద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి లింగస్వామి, రాజశేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ అంధుల కోసం ఏర్పాటు చేయబోతున్న ప్రత్యేక కంప్యూటర్ శిక్షణ కేంద్రానికి తమ వంతు సహకారం అందజేస్తామన్నారు.

రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ ఆల్‌రౌండర్‌గా చాగలమర్రి యువకుడు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రికి చెందిన జహంగీర్ బాషా తనయుడు అర్షద్ విశాఖ పట్నంలో జరిగిన 3వ జాతీయ క్యాడెట్ అండర్-17 రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్ షిప్‌లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి, బెస్ట్ ఆల్ రౌండర్, బెస్ట్ బౌలర్‌గా అవార్డు పొంది రికార్డు సృష్టించాడు. క్రీడలో రాణిస్తున్న అర్షద్‌ను రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ గౌసియా బేగం, రాష్ట్రం వైసీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బాబులాల్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమీర్, చాగలమరి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తులశమ్మ, ఉప సర్పంచ్ సోహైల్, భారత్ గ్యాస్ డీలర్ రఫీ, తెలుగు గంగ ఏఈ సలీంలు అభినందించారు.

డిగ్రీ కళాశాలలో రెండో విడత అడ్మిషన్లు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం బి.ఎ, బియస్సి (బాటనీ, జువాలజీ), బీకాం(సిఏ) గ్రూపులకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ రెండవ విడత ప్రారంభం అయిందని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగన్న తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నుండి వచ్చే నెల 1వ తేదీ వరకు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ కళాశాలలో ఉచితంగా చేస్తామన్నారు. ఇతర వివరాలకు 8790916832, 9676111365 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

పేదల కోసమే ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సంజామల : గ్రామీణ ప్రాంత పేదల కోసమే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటీ ట్రస్ట్ చైర్మన్ దస్తగిరి రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని మంగపల్లి గ్రామంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటీ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ పేద ప్రజల కోసమే ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 35వ ఉచిత వైద్య శిబిరంలో 1400 మందికి అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు చెప్పారు.

పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - పగిడ్యాల : మండలంలోని ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఎస్సై నాగార్జున ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ప్రశాంతమైన గ్రామాలలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్న చిన్న సమస్యలకే రెచ్చగొట్టి అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. రాజకీయ నాయకుల మాటలు నమ్మి గ్రామాలలో అశాంతిని సృష్టిస్తే ఊచలు లెక్క పెట్టాల్సిందేనన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు సూచించారు.

ఎదురెదురుగా వాహనాలు ఢీ

- పలువురికి గాయాలు

ప్రజాశక్తి - వెలుగోడు : వెలుగోడు-ఆత్మకూరు ప్రధాన రహదారిలో ఆదివారం వేకువజామున స్కార్పియో, సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. వెలుగోడు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాల కరస్పాండెంట్ ఇమ్మానియేల్ కుటుంబ సభ్యులతో ఆత్మకూరు నుండి వెలుగోడుకు స్కార్పియో వాహనంలో బయలుదేరారు. ఆత్మకూరు నుండి వెలుగోడుకు సిమెంట్ లోడుతో వస్తున్న లారీని స్కార్పియో వాహనాన్ని ఢీకొంది. స్కార్పియోలో ప్రయాణిస్తున్న ఇమ్మానియేల్ కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

- రెడ్ క్రాస్ సొసైటీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి నిండు ప్రాణాలను కాపాడాలని రెడ్‌క్రాస్ సభ్యులు మద్దిలేటి అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణ శివారులోని వైస్సార్ నగర్ నందు గల కస్తూర్బా పాఠశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు మద్దిలేటి ఆధ్వర్యంలో రక్తదానం, పర్యావరణం, పచ్చదనం-పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటి పచ్చదనం, పరిశుభ్రతకు తోడ్పడాలని తెలిపార. పర్యావరణ పరిరక్షణ కోసం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలో, కళాశాలలో కార్యక్రమాల ఏర్పాటుకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అధికారుల సహకారంతో పటిష్ట ప్రణాళికను తయారు చేసే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. పాల్గొని అనంతరం పాఠశాల ఆవరణంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కస్తూర్బా ప్రిన్సిపల్ రమారెడ్డి, రెడ్ క్రాస్ లైఫ్ మెంబర్స్ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆంజనేయులు, నూర్ భాషా, రెడ్ క్రాస్ డిఎఫ్ఓ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న రెడ్ క్రాస్ సభ్యులు

చవితికి గణేష్ విగ్రహాలు ముస్తాబు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : రానున్న వినాయక చవితి పర్వదినం సందర్భంగా వినాయక విగ్రహాలను ఆళ్లగడ్డ పట్టణంలో పెద్ద ఎత్తున తయారు చేసి విక్రయిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కరోనా పరిస్థితులు తగ్గి పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో ఒక నెల ముందుగానే వినాయక చవితి పండుగ వాతావరణం నెలకొంది. ఆళ్లగడ్డలోని కందుకూరు రోడ్డులోని టీఎంసీ దాల్ మిల్ సమీపంలో గణేష్ విగ్రహాల తయారీ, అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా విగ్రహాల తయారీదారుడు సుధాకర్ మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా తాము ఆళ్లగడ్డలో విగ్రహాలను తయారు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో గణేష్ విగ్రహాలను సుదూర ప్రాంతాల నుండి ప్రజలు తెచ్చుకోవాల్సి వచ్చేదని, ప్రస్తుతం తాము స్థానికంగా అన్ని రకాల సైజులలో గణేష్ విగ్రహాలు తయారుచేసి అమ్ముతున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఆళ్లగడ్డ ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిరుద్యోగం, అధిక ధరలపై పోరాటం : సిపిఎం

ప్రజాశక్తి-డోన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా, ప్రజాసమస్యల పరిష్కారానికి, విద్యుత్ చార్జీలు, అధిక ధరలు, నిరుద్యోగంపై ఈ నెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకు సిపిఎం దేశ వ్యాప్తంగా సమర భేరి పోరాటాలు నిర్వహిస్తుందని సిపిఎం పట్టణ మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కె.నాగరాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని కొండపేటలో సిపిఎం కార్యాలయంలో పట్టణ కమిటీ సభ్యులు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజా సమస్యలు గాలికి వదిలి ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందన్నారు. విద్యుత్ చార్జీలు, అధిక ధరలు, నిరుద్యోగ సమస్యపై పట్టణ, మండలాల్లో ఈ నెల 30, 31న ప్రజా సంతకాల సేకరణ, 1, 2వ తేదీ సచివాలయం ముందు ఉద్యమాలు, 4వ తేదీ ప్రజల్ని పెద్దఎత్తున సమీకరించి తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపిఎం నాయకులు నాగమద్దయ్య, షేమిమ్ బేగం, నక్కిహరి, హబీబ్ బాషా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని జర్నలిస్టు కాలనీ : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : పట్టణంలోని జర్నలిస్టుల కాలనీ గత 20 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదని సిపిఎం నాయకులు పకీరు సాహెబ్, గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని జర్నలిస్టు కాలనీని వారు సందర్శించి పరిశీలించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ అప్పటి ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నియోజకవర్గంలోని విలేకరులకు హాజీ నగర్ ఉర్దూ స్కూల్ వెనకాల దాదాపు 35 మందికి 2003లో పట్టాలు మంజూరు చేశారని, అప్పటి నుండి ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోక సమస్యల నిలయంగా మిగిలిపోయిందని అన్నారు. అలాగే గౌరు చరిత ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దాదాపు 30 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, కాలనీలో కొంతమంది విలేకరులు నివాసం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆర్థిక పరిస్థితి బాగోలేక కొందరు ఎలాంటి గృహాలు నిర్మించుకోలేదని, ఆంజనేయస్వామి గుడి వద్ద నుండి మట్టి రోడ్లు విలేకరుల కాలనీ వరకు వేశారని, ఇంతవరకు సిసి రోడ్లకు నోచుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సిసి రోడ్లు వేయాలని, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నేడు స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని తెలిపారు.

నేర నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో నేరాలను నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కె.రఘు వీర్ రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆదివారం నంద్యాల పోలీస్ ప్రధాన కార్యాలయం నుండి నంద్యాల, ఆత్మకూరు, డోన్, ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లు, సర్కిల్ పోలీస్ స్టేషన్‌ల అధికారులతో నేర సమీక్ష సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎస్పీ నిర్వహించినారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు, పురోగతిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఎస్‌పి ఆరా తీశారు. అనంతరం ఎస్‌పి మాట్లాడారు. పోలీస్ స్టేషన్ల వారీగా యూఐ కేసులు తగ్గించుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలన్నారు. అరెస్టులు, చార్జ్ షీట్లు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా చూసుకోవాలని చెప్పారు. నమోదైన కేసులలో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నేరస్తులు తప్పించుకునే వీలు లేకుండా న్యాయ స్థానాలలో తగిన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి శిక్ష పడేలా అన్నీ ఆధారాలు సేకరించి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. గంజాయి, పిడిఎస్ రైస్, నాటు సారా తదితర అక్రమ రవాణా కార్యకలాపాలు చేస్తున్న వారిపై ఉక్కు పాదం మోపాలన్నారు. తూర్పు ఏజెన్సీ ప్రాంతాల నుండి గంజాయి నంద్యాల జిల్లాకు రవాణా కాకుండా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలను,

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్‌పి రఘువీర్ రెడ్డి

కోర్టు కేసుల విషయాలన తెలుసుకొని కోర్టు విధులు నిర్వహించే సిబ్బందికి సరైన మార్గదర్శకాలను ఇవ్వాలన్నారు. హైవేపై వాహన తనిఖీలు నిర్వహిస్తూ రాత్రిపూట వాహనదారులకు ఫేస్ వాష్ డ్రైవ్‌ను నిర్వహిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. తరచూ దొంగతనాలు జరుగు ప్రాంతాలలో రాత్రి, పగలు బీట్ సిస్టంను బలోపేతం చేసి అక్కడ పాయింట్ బుక్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. బ్లూ కోల్ట్స్ వాహనాలు నిరంతరం పెట్రోలింగ్ చేసే విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

డి పట్టా భూమిలో వెంచర్ వేశారు..

- మా పొలం కాజేయాలని చూస్తున్నారు..
- బాధితుడు అబ్దుల్ సమద్

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణంలోని అబ్దుల్లాపురం గోడౌన్ వద్ద తన పొలంతో పాటు డి -పట్టా ఉందని అది రెవెన్యూ రికార్డు పరంగా ఆన్‌లైన్‌లో లేకపోయినా రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు గృహాలకు వెంచర్ వేశారని బాధితుడు అబ్దుల్ సమద్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో బాధితుడు అబ్దుల్ సమద్ మాట్లాడారు. సర్వే 31-2లో 2 ఎకరాల 15 సెంట్లు, సర్వే 45-బిలో (డి-పట్టా) 40 సెంట్లు పొలం ఉందని తెలిపారు. మొత్తం పొలం విస్తీర్ణం 2 ఎకరాల 55 సెంట్లు అన్నారు. ఇదే సర్వే నెంబర్లలో తన తండ్రి అజీజ్‌తో పాటు బాబాయ్‌లు బషీర్, రషీద్ పేర్లపై రిజిస్టర్ డాక్యుమెంట్లు ఉన్నాయని చెప్పారు. సర్వే 31-2, 45-బి (డి-పట్టా)లో తన తండ్రి వాటా 73 సెంట్లు తనకు, తన కుటుంబ సభ్యులకు వర్తిస్తుందని తెలిపారు. నా సోదరులైన వాజిద్, ముజీబ్ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులతో కుమ్మక్కై 'నాతో పాటు నా చెల్లెళ్ల వాటాను కాజేయాలని చూస్తున్నారు' అని చెప్పాడు. ఇప్పటికీ వాటాల పరంగా మా మధ్య ఘర్షణ జరుగుతోందని అన్నారు. తనకు రావాల్సిన ఆస్తి హక్కు కోసం కోర్టును ఆశ్రయించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ఈ విషయంపై సర్వేయర్ ఉపేంద్రను ప్రజాశక్తి వివరణ కోరగా సర్వే 31-2లో 2 ఎకరాల 15 సెంట్లు, సర్వే 45-బిలో (డి-పట్టా) 40 సెంట్లకు ఆన్‌లైన్‌లో చలానా చెల్లించి కొలతలు వేయమని కోరారని చెప్పారు. అదేవిధంగా సర్వే రిపోర్ట్ ఇచ్చానని, వెంచర్లు వేసుకుని అమ్ముకోమనే చెప్పే అధికారం నాకు లేదన్నాడు. ప్రజలు అనధికార వెంచర్లను కొని మోసపోవద్దని సూచించారు. అలాగే వెలుగోడు విఆర్ఓ చక్రి ఈ విషయంపై మాట్లాడతూ ల్యాండ్ కన్వర్షన్‌కు 31-2, 45-బి సర్వే నెంబర్లలో తమను ఎవరు సంప్రదించలేదని, అధికారికంగా ఎటువంటి ధ్రువపత్రాలు ఇవ్వలేదని తెలిపారు.

వెంచర్ వేశారని చూపుతున్న బాధితుడు అబ్దుల్ సమద్

ఖరీఫ్ రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - బేతంచర్ల : బేతంచెర్ల మండలంలో ఖరీఫ్ సీజన్లో వేసిన కంది, పత్తి, వేరుశనగ తదితర పంటలు ఎండిపోవడంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లంకా సుబ్బరాయుడు, మండల ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రంగాపురం, అంబాపురం, బుక్కాపురం, రహిమాన్‌పురం గ్రామాల్లో ఎండిపోయిన పంటలను రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసిన పంటలు సరైన వర్షాలు లేక ఎండిపోతున్నాయని, వర్షాలు లేక భూగర్భ జలాలు కూడా అడుగంటిపోయి, బోరు బావులు ఎండిపోయాయని తెలిపారు. అన్నదాతను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో రైఉ సంఘం మండల గౌరవాధ్యక్షులు నీలి కిష్టన్న, రంగాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు మాబు, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకట రాముడు, లింగారెడ్డి, ఇద్రుస్ భాష, ఈశ్వర్ రెడ్డి, తిరుపం రెడ్డి, ఖాదర్ బాషా, అంబాపురం రైతులు అనిల్, దాదావలి, భాస్కర్, బుక్కాపురం రైతులు మద్దిలేటి, నాగమద్దయ్య, రహిమాన్ పురం పక్కీరయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఎపిటిఎఫ్ నేతల ప్రభుత్వాన్ని తడిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మోకాళ్లపై నిలబడి ధర్నా చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బి.మాధవ స్వామి అధ్యక్షత వహించి మాట్లాడారు. బదిలీలు, ప్రమోషన్లు జరిపి మూడు నెలలు దాటినప్పటికీ ఇంతవరకు 60 వేల మంది ఉపాధ్యాయులకు జీతాలు చేయకపోవడం విడ్డూరంగా ఉంద న్నారు. ఉపాధ్యాయులు జీతాలు మహాప్రభో అంటూ అల్లాడిపోతున్నారని, వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విపి. శ్రీనివాసులు, జె.రాజేంద్ర ప్రసాద్, ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు లాజరస్, ఎం. పుల్లయ్య, ఏ.మునిస్వామి, సుబ్బరాయుడు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎం.మధుసూదన్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు జీతాల సమస్యను పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ వి.సుబ్బ రాయుడు, కుమార్ బాబు, చాంద్ బాషా, బాలాజీ నాయక్, ఖాద్రి, కృష్ణయ్య రెహమాన్, భాష తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి మరింత వేగవంతం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మహానంది

దాతల సహకారంతో మహానంది ఆలయ అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మహానంది క్షేత్రంలో కొలువైన కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే దంపతులకు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, పాలక మండలి చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డిలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికార. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేయించారు. అనంతరం ఆలయ ఈవో ఎమ్మెల్యే దంపతులను శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి జ్ఞాపికను అందజేశారు. వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రంలో భక్తుల వసతి కోసం టిటిడి దేవస్థానం నిధులతో రూ. 4 కోట్ల 60 లక్షలతో వసతి గృహాల నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వీటితోపాటు దాతల సహకారంతో మరో 50 రూముల నిర్మాణానికి కూడా కమిషనర్ అనుమతులు పొందామన్నారు. మహానంది క్షేత్రానికి నంది సర్కిల్, మాఢ వీధుల చుట్టూ ల్యాండ్ స్కేపింగ్ పనులు తన సొంత నిధులతో జరుగుతున్నాయని తెలిపారు. క్షేత్రంలోని బయట రెండు కోనేరులు 80 లక్షల రూపాయలతో పనులు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా చాలా సంవత్సరాలుగా నిజరూప దర్శన సేవలు భక్తులకు నిరంతరం లేదని, తిరిగి స్వామివారి నిజరూప దర్శనం నిరంతరం భక్తులకు కల్పించే విధంగా ఈరోజు నుండి సేవలు ప్రారంభించామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో మాత్రమే ఉన్న వడ ప్రసాదం పరిశీలించి మహానందిలో కూడా ఈరోజు నుండి భక్తులకు అందుబాటులో ఉండేలా ప్రారంభించామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మహానంది గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను, ఎస్వీఆర్ కళ్యాణమండపంను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, ఎంపీడీవో శివ నాగజ్యోతి, వైసిపి నాయకులు భూమా సుబ్బరామయ్య, నాగభూపాల్ రెడ్డి, ఒంటెద్దు వీరారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన పథకాలను కొనసాగించాలి : టిడిపి

ప్రజాశక్తి - ఆత్మకూరు

గిరిజన సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం కొనసాగించాలని టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి డుమావత్ స్వామి నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆత్మకూర్ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గిరిజనులతో సమావేశమైన ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ పథకాలను రద్దు చేసిందని, వాటిని కొనసాగించాలని, టిడిపి ప్రభుత్వంలో ఎస్టీలకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కేవలం అమ్మఒడి పేరుతో గిరిజనులను మోసం చేస్తుందని, ఎస్టీ కాలనీలో ఉన్న ఎలిమెంటరీ స్కూల్‌లను మూసివేసి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్కూళ్లలో కలపడం దురదృష్టకరమన్నారు. రాబోయే ఎన్నికల్లో గిరిజనులంతా ఏకమై వైసిపికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కాశీ నాయక్, నాగ స్వామి నాయక్, సురేష్ నాయక్, లలిత్ నాయక్, రామ్ కిరణ్ నాయక్, సాయి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని ఆర్‌సిఎం ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. కర్నూలు, కడప, అనంతపురం, హైదరాబాదు, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో స్థిరపడిన సుమారు 70 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. 18 సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం పూర్వ ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ రెడ్డి, అప్పటి ఉపాధ్యాయులైన మౌలాలి, సునీల్, మహమ్మద్ గౌస్, రమేష్, రాజ్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యాయేతర సిబ్బంది బాలస్వామి, జీవరత్నంలను శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం మృతి చెందిన పూర్వ ఉపాధ్యాయులైన సురేష్ వర్మ, నారాయణమ్మ, చిన్నపురెడ్డి, ప్రకాష్ రెడ్డి, దస్తగిరిలకు, పూర్వపు విద్యార్థి హరిబాబుకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముల్లాగఫార్ నసీబ్, హుసేన్ బాష, ఆసిఫ్, ఖాదర్‌బాష, మహమ్మద్ గౌస్, మహమ్మద్ రఫి, శ్యాబుద్దీన్, అబ్దుల్ రఫి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పురపాలక పారిశుధ్య కార్మికుల కోసం పురపాలక వైద్యాధికారి డాక్టర్ అంకిరెడ్డి నిర్వహణలో ఐఎంఏ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పురపాలక శాఖ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ జఫరుల్లా అధ్యక్షతన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి రవికృష్ణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని, వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన తబాధ్యత సమాజంపై ఉందని, అందులో భాగంగా ఐఎంఏ వైద్య శిబిరం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ వైద్య శిబిరాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి, కాపాడ డానికి ఆస్కారం ఉంటుందని అన్నారు. డాక్టర్ జఫరుల్లా మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నంద్యాల వైద్యులు పట్టణంలోనే కాకుండా పలు గిరిజన ప్రాంతాల్లో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ అంకిరెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు వృత్తి నిర్వహణలో భాగంగా కొన్ని ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న విషయాన్ని గమనించి ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. దాదాపు 20 మంది పైగా వివిధ స్పెషాలిటీ రంగానికి చెందిన వైద్యులు 300 మంది పైగా కార్మికుల్ని పరీక్షించి అవసరమైన ఈసీజీ పరీక్షలు చేసి వైద్య సలహాలు ఇవ్వడమే కాకుండా రూ. 20 వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పురపాలక సూపర్ వైజర్ లక్ష్మి నారాయణ, శానిటరీ ఇన్స్పెక్టర్ శివ ప్రసాద్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.



చౌడేశ్వరి దేవస్థానాకి విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానం అభివృద్ధికి నందవరం గ్రామానికి చెందిన ఉలువల సురేష్ కుమార్ రెడ్డి కుమారుడు మధుసూదన్ రెడ్డి, కుమార్తె సంధ్య రెడ్డిలు రూ. 1 లక్ష 65 వేలు విరాళంగా ఆదివారం అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ పి. ఆర్. వెంకటేశ్వర రెడ్డికి, అర్చకులకు విరాళం నగదును అందజేశారు.

పెద్దమ్మ అన్నదాన సత్రానికి విరాళం

మండలంలోని టంగుటూరు పెద్దమ్మ అన్నదాన సత్రం భవన నిర్మాణానికి రూ.50,116 భక్తులు విరాళం ఇచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు రామ గంగిరెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని అప్పలాపురం గ్రామానికి చెందిన కడపయ్య గారి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి సావిత్రమ్మ, వారి కుమారులు శ్రీనివాస రెడ్డి, రామపుల్లారెడ్డి, కుటుంబసభ్యులు విరాళం నగదును అందజేశారు.

ఆళ్లగడ్డలో హ్యాపీ సండే కార్యక్రమం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని శిల్పా నేచర్ హోమ్స్ రోటరీ క్లబ్ ఆరోగ్య వేదిక వద్ద ఆదివారం హ్యాపీ సండే జోష్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ఉమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోటరీ ఆరోగ్య వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ రామ్ గోపాల్ రెడ్డి అందిస్తున్న సేవలను ఆమె కొనియాడారు. డాక్టర్ ప్రసాద్ క్లాప్ థెరపీ, యోగ, ప్రాణాయామ సాధన క్రియలు ముద్రలపై శిక్షణ ఇచ్చారు. విశ్వశాంతి హై స్కూల్ విద్యార్థులు హెల్త్ అవేర్నెస్ పై చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్, రోటరీ సభ్యులు క్రీడాకారులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని పెద్ద బోధనం గ్రామంలోనీ పరిశుద్ధ స్తెఫెన్ చర్చి నిర్మాణం కోసం నంద్యాల అధ్యక్ష ఖండపు బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ పుష్ప లలితమ్మ ఆదివారం పనులు ప్రారంభించారు. అనంతరం పురాతన చర్చిలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. తాత్కాలికంగా ప్రార్థించేందుకు ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు ప్రార్థన మందిరాన్ని ఆమె ప్రతిష్టించారు. కార్యక్రమంలో పెద్ద బోధనం పాస్టర్ చైర్మన్ రెవ కొత్తమాసి సంపత్ కుమార్, నంద్యాల డయాసిస్ సెక్రటరీ జక్కం విలియం స్టాండ్లీ తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోనిచిన్నవంగలి గ్రామ సచివాలయంలో ఇఒఆర్‌డి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎంపిటిసి కె.లక్ష్మీరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని 304 మంది రైతులకు మంజూరైన భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి మౌళిబాష, మాజీ జడ్పిటిసి టి.రామగుర్విరెడ్డి, విఆర్ సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో పెరిగిన భక్తుల రద్దీ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రావణమాసం పురస్కరించుకొని శ్రీశైల క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి పెరిగింది. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుండే కాక పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం చేరుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తెల్లవారుజామున 4-30 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర క్యూలైన్లలో భక్తులకు అనుమతి ఇచ్చారు. క్యూ కాంప్లెక్స్‌లోకి భక్తులకు మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లు అందజేశారు. స్వామి అమ్మవార్లను దర్శించు కునేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతుందని భక్తులు తెలిపారు. భక్తులు అడిగిన అన్ని ఇచ్చేందుకు లడ్డు ప్రసాదాలు అందుబాటులో ఉంచినట్లు దేవస్థానం అధికారులు చెప్పారు. అన్నపూర్ణ భవనంలో భక్తులకు ఉచిత అన్న ప్రసాదాన్ని ఉచితంగా ఏర్పాటు చేశారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలతోటి చేసుకోకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా కెమెరాలతో కంట్రోల్ రూమ్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలో ఉన్న కమ్యూనిటీ సత్రాలు, కాటేజీలు భక్తులతో నిండిపోయాయి.

మల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు

శ్రావణమాసం సందర్భంగా శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను ఆదివారం పలవురు ప్రముఖులు దర్శించుకున్నారు. ప్రముఖులలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఏవి రవీంద్రబాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం హైకోర్టు న్యాయమూర్తి కే లక్ష్మణ్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

ప్రముఖులకు స్వాగం పలుకుతున్న శ్రీశైల దేవస్థానం ఇఒ లవన్న తదితరులు

IN THE COURT OF SENIOR CIVIL JUDGE DHONE.
Insolvency Petition No.24/2023
PIKKILI KRUSHNAMURTHI.
...PETITIONER/DEBTOR
V/s
SESHI REDDY AND OTHERS.
...RESPONDENTS/CREDITORS

1. PETITIONER/ DEUTOR:
PIKKILI KRUSHNAMURTHI, Age: 30 years, S/o.Pikkili Maddayya, Hindu, Coolle, R/o.H.No.5-17, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist.

2. RESPONDENTS/ CREDITORS:
1.SESHI REDDY, Age: 45 years, S/o.Subba Reddy, Hindu, Business, R/0.H.No.2-16, R. Kothapalli village, Bethamcherla Cell:8886267399. mandal, Nandyal Dist.,
2. TIRUMALESU REDDY, Age: 48 years, S/o.Narayana Reddy, Hindu, Business, R/o.H.No.2-15, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:7981075514.
3. G. CHALAPATHI REDDY, Age: 43 years, S/o.Venkatarami Reddy, Hindu, Business, R/o.H.No.2- 18, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:6302982264.
4. NETHALA RAMASUBBA REDDY, Age: 58 years, S/o.Subba Reddy, Hindu, Business, H.No.2-16, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:9963625564.
5. KAMIREDDY MOHAN REDDY, Age: 52 years, S/o.Obula Reddy, Hindu, Business, R/o.H.No.4-51, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:
6. KAMIREDDY AMARNATH REDDY, Age: 45 years, S/o.Obula Reddy, Hindu, Business, R/o.H.No.4-53, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:
7.C.BALARAMUDU, Age: years, S/o.Eswaraiah, Hindu, Business, R/o.H.No.3-4, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:
8. VENKATAIAH, Age years, S/o.Maganti Konda, Hindu, Business, R/o.H.No.4-76, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:
9. S. SATYAMAIAH, Age years, S/o.Narayana, Hindu, Business, R/o.H.No.32, R.Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:9618326133
10. P. JAMMAMMA, Age:52 years, W/o.Sriramulu, H R/0.3-7, R. Kothapalli village. Bethamcherla Sandyal Dist., Cell:6281207242.
11. SIRASANI SUBBA REDDY, Age:62 years, S/o.Obula Reddy Hindu, Business, R/o H.no.1-55, R. Kothapalli Bethamcherla mandal, Nandyal Dist.. village, Cell:9959454629.
12. ALA MOHAN, Age: 45 years, S/o.Narayana, Hindu, Business, R/o.H.No.3-16, R.Kothapalli village, Bechera mandal , Nandyal Dist., Cell:
13.SIRASANI MAHESWARA REDDY, Age: 35 years, S/o.Obul Reddy, Hindu, Business, R/D.H.No.4-6, R.Kathapall village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:
14. T. NADIP1 SUBBA REDDY, Age:68 years, S/o.Subba Reddy, Hindu, Business, R/0.H.No. 2-4, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:9990626139.
15. G. SRINIVASA REDDY, Age : 28 years, S/o Chinna Venkataramil Reddy, Hindu, Business, R/o H.No.1-65, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:
16. CHINNASWAMI REDDY, Age: 64 years, S/o.Pedda Muni Reddy. Hindu, Business, R/o.H.No.1-38-A, R Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist Cell:9963638230.
17. VISHNU PRABHAKAR REDDY, Age : 38 years. S/o.Pedda Swami Reddy, Hindu, Business, R/o H.No.2-1, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:
18. KUMMARI NAGISETTY, Age: 63 years, S/o.Pedda Gurrappa, Hindu, Business, R/o.H.No.4-22, R. Kothapalli village, Cell: Bethamcherla mandal, Nandyal Dist.,
19. ALA CHINNA VENKI REDDY, Age:50 years, S/o.Pedde Venki Reddy, Hindu, Business, R/o.H.No.4-6, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:
20. K. BALA GURRAPPA, Age:38 years, S/o.Gurrappa, Hindu, Business, R/o.H.No.4-63, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:
21. KITARU NARASIMHUDU, Age:52 years, S/o.Venkatalah, Hindu, Business, R/o H.No-4-28, R Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist.. Cell:
22. KATARI RAMANJANEYULU, Age: 45 years, S/o.Ranganna, Hindu, Business, R/o.H.No.5-35, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell: 9444575740
23. KATARI BABAIAH, Age:40 years, S/o.Pulikonda Hindu, Business, R/o.H.No.5-36, R. Kothapall village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:9963625619
24. PALLEM CHINNA RAMUDU, S/o.Maddiley, Age: 70 years, Hindu, Business, R/o.H.No.3-6, Nallamekalapalle vlage, Peapully mandal, Nandyal Dist., Cell:9121463973
25. P. BALAMADDI RAJU, Age:55 years, S/o.Chinna Ramudu, Hindu, Business, R/o.H.No.3-11, Nallamekalapalle village, Peapully mandal, Nandyal Dist., Cell:7207514174
26. PULLEM SUNKANNA, Age:48 years, S/o.Pullem Chinna Ramudu, Hindu, Business, R/o.H.No.3-9, Nallamekalapalle village, Peapully mandal, Nandyal Dist., Cell:8978482946
27. PULLEM MADHU RAJU, Age:50 years, S/o.Pullem Chinna Ramudu, Hindu, Business, R/O.H.No.3-10, Nallamekalapalle village, Peapully mandal, Nandyal Dist., Cell:8374979589
28. PULLEM MADDILETY SWAMY, Age:40 years, S/o. Pullem Chinna Ramudu, Hindu, Business, R/0.H.No.3- 40, Nallamekalapalle village, Peapully mandal, Nandyal Dist., Cell:8374480974
29. M. CHINNA SUNKULAMMA, Age:45 years, W/o.Bala Maddilety, Hindu, Housewife, R/o.H.No.4-89, Boyavandlapalle village, Peapully mandal, Nandyal Dist.,Cell:
30.C.MADDAIAH, Age: 60 years, S/o.Pedda Maddalah, Hindu, Business, R/o.H.No.2-14, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:6300619607
31. SIVASANKAR REDDY, Age: 28 years, S/o.Venkatarami Reddy, Hindu, Business, R/o.H.No.4-11, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist., Cell:
32. RANGAIAH, Age: 34 years, S/o.Maddireddy, Hindu, Business, R/O.H.No.4-14, R. Kothapalli village, Bethamcherla mandal, Nandyal Dist.

నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం ఆర్.కొత్తపల్లె గ్రామ ప్రజలకు మరియు పాపిలి మండలం ప్రజలకు తెలియజేయునది ఏమనగా పై నెంబర్ ఐ.పి.లో అర్జీదారు PIKKILI KRUSHNAMURTHI S/o.Pikkili Maddayya, R/o కొత్తపల్లె గ్రామం, బేతంచర్ల మండలం, నంద్యాల జిల్లా. పతుల వ్యాపారంలో నష్టపోయి సదరు నష్టములను చెల్లించలేని దివాలాదారునిగా తీర్మానించ వలెనని కోరుతూ పై కోర్టులో అర్జీదాఖలు (ఐ.పి.పిటిషన్) చేసినారు. ఇందుపైన ఎవరికైనా అక్షేపణలు ఉన్నయెడల తేది 28-09-2023 తేది పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకోవలసినది. లేని ఎడల పై పిటీషనును విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 28-09-2023

A.SREEDHAR, BSc, LLB
V.Ravi Prakash, B.A, LLB
న్యాయవాదులు, పిటిషనర్ తరపు
Dhone-518222, Nandyal (Dt), A.P.
Mobile : 9396300365